

కియ తొలికారు

కియ కారు ట్రయల్ రన్ ప్రొడక్షన్‌లో పాల్గొన్న చంద్రబాబు, కియ ప్రతినిధులు (ఫైల్)



చంద్రన్న చేసిన అద్భుతం.. కియ..

ఎన్నో రాష్ట్రాలతో పోటీ పడి కైవసం

- రికార్డు సమయంలో అనుమతులు
- జెట్ వేగంతో పనులు
- నెలల వ్యవధిలోనే ఉత్పత్తి
- పెట్టుబడుల వరద..
- పదుల సంఖ్యలో అనుబంధ పరిశ్రమల ఏర్పాటు
- వేల మందికి ఉపాధి
- వైసీపీ పాలనలో అంతా రివర్స్
- పక్క రాష్ట్రాలకు అనుబంధ పరిశ్రమలు
- మళ్లీ చంద్రబాబు వస్తే.. మరింత అభివృద్ధి..

వాన కురవడం అరుదు..
పంటలు పండితే అదృష్టమే..
తాగునీటికీ తిప్పలే..
ఎటుచూసినా..
కొండలు, గుట్టలే..
కరువు ప్రాంతంగా పేరు..
అభివృద్ధికి ఏ
అవకాశమూ లేదు..
ఇలాంటి చోటే..
చంద్రన్న అద్భుతం చేశారు..
ఎక్కడి నుంచో కాలువ తవ్వి..
నీరు తెచ్చి.. డ్యాం కట్టి..
పంటలు పండని నేలలో..
ఏకంగా కార్ల పంట
పండించారు.. అదే కియ..
అనంత జిల్లా ల్యాండ్ మార్క్..
ప్రపంచ పటంలో గుర్తింపు
తెచ్చిన పరిశ్రమ..


కియ కార్ల పరిశ్రమ

పుట్టపర్తి, మే7(ఆంధ్రజ్యోతి): సరిగ్గా ఎనిమిదేళ్ల కింద ఏపీలోనే అతి తక్కువ వర్షపాతం, కరువు అని చెప్పుకునే ఉమ్మడి జిల్లాలో కియ అడుగుపెట్టింది. జెట్ వేగంతో పరిశ్రమ నిర్మాణం పూర్తి చేసుకుని, జనం తలసరి ఆదాయాన్నే మార్చేసింది. అంతర్జాతీయ కియ కార్ల దిగ్గజం కియతో పాటు అనుబంధ సంస్థలు రావడంతో యువతకు ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి బీజం పడింది. పెనుకొండ ప్రాంత రూపురేఖలను మార్చేసి, పారిశ్రామిక హబ్‌గా అవతరించింది కియ కార్ల పరిశ్రమ. పరిశ్రమల పేరుతో టీడీపీ అధినేత, అప్పటి సీఎం భూములు తీసుకుని, అరచేతిలో వైకుంఠం చూపుతారని విమర్శలు గుప్పించిన వైసీపీ నోళ్లకు తాళం వేసింది కియ. పరిశ్రమ ఏర్పాటుతో ప్రపంచ పారిశ్రామికవేత్తల చూపు శ్రీసత్యసాయి జిల్లాపై పడింది. పరిశ్రమ ఏర్పాటుతో ఆ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా అవతరించింది. బెంగళూరు-అనంతపురం పారిశ్రామిక కారిడార్‌కు పునాది వేసింది. కరువు జిల్లాను ఉపాధి కల్పన జిల్లాగా మార్చేసింది.


ఉపాధి పొందుతున్న యువత


ఏపీకే ల్యాండ్ మార్క్

దక్షిణ కొరియాకు చెందిన కియ బృందం సభ్యులు 2016 జూలై 22న ఉమ్మడి అనంత జిల్లాలోకి అడుగు పెట్టారు. తర్వాత పలు రాష్ట్రాల్లో భూములను అన్వేషించారు. నెల తిరక్కుండానే మళ్లీ ఆగస్టు 12న మరోసారి వచ్చి పెనుకొండ మండలం అమ్మవారుపల్లి, ఎర్రమంచి వద్ద పరిశీలించారు. పలు దఫాలు కియ ప్రతినిధులు వచ్చి వెళ్లారు. ఎర్రమంచి వద్ద కార్ల పరిశ్రమ ఏర్పాటుకు 2017 ఏప్రిల్ 20న అమరావతిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో కియ మోటార్స్ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. అదే ఏడాది ఆగస్టులో పనులు ప్రారంభమయ్యాయి. జెట్ వేగంతో సాగాయి. అందరి అంచనాలు తల్లకిందులు చేస్తూ ఎర్రమంచి వద్దకు భారీ యంత్రాలు దించేసి, భూమి చదును పనులు మొదలు పెట్టారు. ఎర్రమించి, అమ్మవారుపల్లి వద్ద సేకరించిన 535.5 ఎకరాల్లో కియ ప్రధాన ప్లాంటు ఏర్పాటైంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.182 కోట్లతో ఐదు దశల్లో భూమి

కరువు నేలలో కార్ల పంట


జిల్లాలో తొలిసారిగా పర్యటించిన కియ ప్రతినిధుల బృందం (ఫైల్)

చదును పనులు చేయించి, పరిశ్రమకు అప్పగించింది. కేవలం ఆరు నెలల్లోనే కియ పరిశ్రమలో ప్రధాన సెక్టార్ల పనులు వేగం పుంజుకున్నాయి. 2018 ఫిబ్రవరిలో ఫ్రేమ్ ఇన్‌స్టలేషన్ చేసి, 2019 జనవరి 29న కార్ల ఉత్పత్తిని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఏటా మూడు లక్షల కార్ల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటైంది. 2023 జూలైలో పలు మోడళ్లతో పది లక్షల కార్ల ఉత్పత్తి మైలురాయిని కియ దాటేసి, చరిత్ర సృష్టించింది. నేడు లక్షల కార్ల ఉత్పత్తితోపాటు వేలాదిమందికి ఉపాధి కల్పిస్తోంది.



పెట్టుబడుల వరద

కియ కార్ల పరిశ్రమ 775.57 ఎకరాల విస్తీర్ణంలో, రూ.13500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైంది. కియకు అనుబంధంగా భవిష్యత్తులో ఎలక్ట్రికల్ హైబ్రిడ్ వాహనాలు ఉత్పత్తి చేసేందుకు అనువుగా గతేడాది ప్లాంటులోని కేఎంఐ కేంద్రంలో ప్రొడక్షన్ లైన్ల డిజైనింగ్ చేశారు. పెనుకొండ, పాలసముద్రం, గోరంట్ల, గుడిపల్లి వద్ద 424 ఎకరాల్లో 30కిపైగా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అలా పెట్టుబడుల వరద పారింది. కియతోపాటు అనుబంధ సంస్థల ఏర్పాటుతో ప్రత్యక్షంగా 30 వేల మంది మందికి, పరోక్షంగా 25వేల మందికిపైగా ఉపాధి లభిస్తోంది. సొంత ఊర్లోనే ఉపాధి లభిస్తుండడంతో వలసలు బాగా తగ్గిపోయాయి. ఇతర ప్రాంతాల నుంచి పెనుకొండకు క్యూకట్టే పరిస్థితి వచ్చింది. కియ పరిశ్రమను వ్యతిరేకించిన వైసీపీ.. అధికారంలోకి వచ్చాక అదే ధోరణి అవలంబించింది. పారిశ్రామికాభివృద్ధికి చొరవ చూపకపోవడంతో అనుబంధ పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోయాయి. యువత మళ్లీ పొరుగు రాష్ట్రానికి పరుగులు పెట్టే దుస్థితిని తీసుకొచ్చింది.




కియ మొదట్లో ఉద్యోగులు



కియ వచ్చింది.. కరెన్సీ నోట్లు తెచ్చింది..



చంద్రబాబు చలువే

మాది విజయనగరం. డిప్లొమా పూర్తి చేశా. కియ పరిశ్రమలో ఏడాదిగా ఇంజిన్ షాపులో పనిచేస్తున్నా. అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ ఏర్పాటు నిరుద్యోగులకు వరం. మాలాంటి వేలాది మందికి కియలో ఉపాధి అవకాశాలు లభించాయి. ఇది చంద్రబాబు చలువే. ఇలాంటి మరిన్ని పరిశ్రమలు తీసుకొస్తే నిరుద్యోగ సమస్యకు చెక్ పడుతుంది.

- రోహిత్, విజయనగరం



సొంతూరిలోనే ఉపాధి

తిరుపతిలో పని చేసుకుంటుండేవాడిని. జిల్లాలో కియ ఏర్పాటుతో ఇక్కడికొచ్చా. క్వాలిటీ విభాగంలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నా. కియ రాకతో ఉమ్మడి జిల్లాలో చాలామందికి ఉపాధి అవకాశాలు వచ్చాయి. జిల్లావాసులతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వేలాది మందికి ఉపాధి లభిస్తోంది. సొంతూర్లోనే ఉపాధి దొరుకుతుండడం ఆనందంగా ఉంది.

- రాజశేఖర్ రెడ్డి, జూనియర్ ఇంజినీర్, అనంతపురం

కియ వచ్చింది.. కరెన్సీ నోట్లు తెచ్చింది..

కియ కార్ల పరిశ్రమ పెనుకొండ వద్ద సంసిద్ధత వ్యక్తం చేయగా మొదట్లో చాలా మంది రైతులు భూములు ఇవ్వమని వ్యతిరేకించారు. అప్పట్లో ప్రభుత్వం పలు మార్లు రైతులతో చర్చించి, వేలు పలికే భూములకు ఎకరాకు రూ.10.50 లక్షలు పరిహారం ఇచ్చింది. తొలిదశలో 475మంది రైతులకు రూ.125 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఒక్కసారిగా కోట్ల రూపాయలు రావడంతో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. కియ చుట్టూ ప్రధాన రహదారుల్లో ఎకరా కోట్ల రూపాయలు పలుకుతోంది. పెనుకొండతోపాటు చుట్టుపక్కల ఇంటి, స్థలం అద్దెలు భారీగా పెరిగిపోయి, డిమాండ్ పెరిగింది. బహుళ అంతస్తులు నిర్మాణాలు వచ్చేశాయి. ఉమ్మడి జిల్లాలో కియ పరిశ్రమ 30 కిలోమీటర్లకు పైగా దూరంలో కియ మోటార్స్ ఇండియా అంటూ బోర్డులు, కొరియన్ రెస్టారెంట్లు, ఆ దేశ భాషలో బోర్డులు ఏర్పాటు చేశారు. పట్టణాలు, పల్లెల్లో ప్రజల జీవన విధానంలో పెనుమార్పులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి రియల్ వ్యాపారులు పెనుకొండలో వాలిపోయి, కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టారు. కియ ఏర్పాటుతో ఉమ్మడి జిల్లా నైసర్గిక స్వరూపం పూర్తిగా మారిపోయింది. కియ, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో అమ్మవారిపల్లి, హరిపురం, కురుబవాండ్లపల్లి, చిన్నపరెడ్డిపల్లి, గుట్టూరు, దుద్దేబండ, చంద్రగిరి, వెంకటగిరిపాళ్యం, గొందిపల్లితోపాటు ఉమ్మడి జిల్లా, పక్క రాష్ట్రాలకు చెందిన వేలాది మంది జీవితాల్లో కియా వెలుగులు నింపింది. కియ ప్రభావంతో అనంతపురం, పుట్టపర్తి, హిందూపురం, గోరంట్ల, పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, చెన్నేకొత్తపల్లి నుంచి కొడికొండ చెక్‌పోస్టు వరకు, కొత్తచెరువు రహదారుల్లో భూముల ధరలకు రెక్కలొచ్చి, నగరాలతో పోటీ పడుతున్నాయి.


వైసీపీ కార్యాలయం వద్దకు వెళ్తున్న వలంటీర్లు

వలంటీర్లకు వైసీపీ తాయిలాలు

ఒక్కొక్కరికి రూ.5వేలు అందజేత..

ఓటర్ల ఇళ్లకెళ్లి అవగాహన కల్పించాలని హుకుం

హిందూపురం, మే 7: అధికార పార్టీ నాయకులు.. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వలంటీర్లకు తాయిలాలు అందజేశారు. పట్టణంలోని వలంటీర్లకు వైసీపీ కార్యాలయంలో ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున నగదు అందజేశారు. మంగళవారం పట్టణంలోని వలంటీర్లకు వైసీపీ కార్యాలయం నుంచి ఫోన్ వెళ్లింది. ప్రతి ఒక్క వలంటీరు కార్యాలయానికి వచ్చి రూ.5వేలు నగదు తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో ఆగమేఘాలమీద వైసీపీ కార్యాలయం వద్ద వలంటీర్లు వాలిపోయారు. ఒక్కొక్కరికి నగదు అందజేశారు. అక్కడే ఉన్న వైసీపీ అభ్యర్థి దీపిక భర్త వేణురెడ్డి వలంటీర్లతో మాట్లాడుతూ.. ప్రతి వలంటీరు బాగా కష్టపడి ఫ్యాన్‌కు ఓటువేయిస్తే వచ్చేనెలలో మీకు రెట్టింపు జీతం ఇస్తామని చెప్పారు. అంతేకాక మెజార్టీ వచ్చిన పోలింగ్‌బూత్‌లలో పనిచేసే వలంటీర్లకు స్పెషల్ గిఫ్టులు ఇస్తామన్నారు. మెజార్టీ తగ్గితే ఉద్యోగాలు ఊడతాయని హెచ్చరించారు.

రోజూ పది ఇళ్లకు వెళ్లండి..

'ఎలాగో మీ పరిధిలో మన పార్టీకి ఓటేసేవారు ఎవరని ఇప్పటికే అర్థమై ఉంటుంది. వారిని వదిలేసి తెలుగుదేశం పార్టీకి అనుకూలమైన వారి ఇళ్లకు వెళ్లి జగన్ సీఎం కాకపోతే ఈ పథకాలన్నీ ఆగిపోతాయనీ, చంద్రబాబు వస్తే ఒక్క పథకం కూడా ఉండదం'టూ అవగాహన కల్పించాలన్నారు. ఏ సమయంలో వెళ్తారో తెలియదుకానీ వారికి అర్థమయ్యేలా ప్రచారం నిర్వహించాలన్నారు. ఎక్కడైనా మీ పరిధిలో మెజార్టీ తగ్గితే చాలా ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. కార్యాలయం వద్దకు కొంతమంది వెళ్లి నగదును తీసుకెళ్లారు.

లేపాక్షిలో వలంటీర్ల రహస్య సమావేశం

లేపాక్షిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం వలంటీర్లతో రహస్య సమావేశానికి వైసీపీ నాయకులు ప్రణాళిక సిద్ధం చేశారు. సుమారు 200మంది వలంటీర్లు నంది విగ్రహం సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లోకి వెళ్లారు. అక్కడ కొంతమంది వలంటీర్లు టీడీపీకి అనుకూలంగా ఉన్నారని వారి వద్ద సెల్‌ఫోన్లు తీసుకున్నారు. మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్లడంతో వలంటీర్లను వెళ్లిపోవాలంటూ చెప్పారు. గ్రామాల్లోకి వెళ్లి వలంటీర్లకు నగదు పంపిణీకి ప్రయత్నాలు చేశారు.


టీడీపీ కూటమి నాయకులను బెదిరిస్తున్న సీఐ యుగంధర్

- పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల్లో
- వైసీపీ నాయకుల హల్‌చల్ ఓటర్లకు ప్రలోభాలు
- అడ్డుకున్న టీడీపీ కూటమి నాయకులు
- పెనుకొండలో అధికార పార్టీకి పోలీసుల వత్తాసు


పోలీసులను నిలదీస్తున్న టీడీపీ అభ్యర్థి సవిత


కదిరి పోలింగ్ కేంద్రంలో హల్‌చల్ చేస్తున్న వైసీపీ నాయకులు

ప్రలోభాలు.. దౌర్జన్యాలు..!

పెనుకొండ టౌన్, మే 7: పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ నాయకులు ప్రలోభాలు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, ఉపాధ్యాయుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కొల్లగొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వారికి కొందరు అధికారులు, పోలీసులు సహకరిస్తున్నారు. పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో మంత్రి ఉష భర్త చరణ్ రెడ్డి మంగళవారం అక్కడికి వచ్చారు. పోలింగ్ కేంద్రం ఆవరణలోకి కారులో వెళుతుండగా టీడీపీ నాయకులు అడ్డగించారు. నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రం వద్దకు ఎలా వెళతారని ప్రశ్నించారు. దీంతో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వాదం సాగింది. సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులు వైసీపీ పక్షాన నిలబడ్డారు. టీడీపీ, బీజేపీ నాయకులను సీఐ యుగంధర్ బెదిరించారు. వేలు చూపుతూ 'జాగ్రత్త' అని హెచ్చరించారు. ఈ గొడవ జరుగుతుండగానే ఉద్యోగులను ప్రలోభపెట్టేందుకు చరణ్ రెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లారు. అక్కడే ఉన్న టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అభ్యంతరం తెలిపారు. మంత్రి భర్తకు ఇక్కడేం పని అని ప్రశ్నించారు. చరణ్‌రెడ్డి తన అనుచరులను వెంటబెట్టుకుని వచ్చినా ఎందుకు అడ్డుకోలేదని పోలీసులను ప్రశ్నించారు. ఆయనను అడ్డుకోకపోగా, తమ కూటమి నాయకులను బెదిరించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు.. అధికార పార్టీ నాయకుల్లా వ్యవహరిస్తున్నారనీ, తప్పుచేసిన వారిని వదిలేసి తమనే దబాయిస్తారా అని సీఐని నిలదీశారు. ఆ తరువాత పరిస్థితి సద్దుమణిగినా.. వైసీపీ నాయకుల ప్రలోభాలు మాత్రం కొనసాగాయి. వివాదం గురించి తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ అక్కడికి చేరుకుని, తన భర్తతో మాట్లాడారు. ఇతర మండలాలకు చెందిన వైసీపీ నాయకులు కూడా అక్కడికి చేరుకుని, హల్‌చల్ చేశారు. దీంతో మరోమారు ఇరు వర్గాల మధ్య వాగ్వాదం తలెత్తింది. వివాదం ముదురుతుండటంతో పోలీసులు.. ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించేశారు.


పెనుకొండ జూనియర్ కాలేజీ పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద మంత్రి ఉష, ఆమె భర్త చరణ్ రెడ్డి


పుట్టపర్తిలో ఆర్‌ఓతో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి

పోలింగ్ బూత్‌లోకి చొరబడి..

కదిరి: పట్టణంలోని బాలికల పాఠశాల పోలింగ్ బూత్‌లో వైసీపీ నాయకుడు సాదిక్ బాషా అనుచరులతో వెళ్లి ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు. టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. వందలమంది వైసీపీ నాయకులు వాహనాల్లో వచ్చి పోలింగ్ స్టేషన్‌లో కలియతిరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదు. వైసీపీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు నేరుగా తమ వాహనాల్లో అనుచరులతోపాటు పోలింగ్ కేంద్రంలోకి వచ్చినా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు. టీడీపీ నాయకులను మాత్రం పోలింగ్ కేంద్రం నుంచి బయటకు పంపారు. డీఎస్పీ శ్రీలతతో వైసీపీ నాయకుడు వజ్ర భాస్కర్‌రెడ్డి వాగ్వాదానికి దిగారు. సమయం 5 గంటలవుతోందని, ఓటర్లు తప్ప.. మిగిలిన వారందరూ బయటికెళ్లాలని డీఎస్పీ ఆదేశించారు. అయినా వజ్ర భాస్కర్‌రెడ్డి అక్కడే ఉండిపోయాడు. దీనిపై టీడీపీ నాయకులు.. డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె.. వజ్ర భాస్కర్‌రెడ్డిని బయటకు వెళ్లాలని ఆదేశించారు.

ఒక్కొక్కరికి ఒక్కో రూలా..?

పుట్టపర్తి: స్థానిక ఆర్వీజే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపీఓలకు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను నిర్వహించారు. వైసీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి.. అనుచరులతో కలిసి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి ప్రయత్నించగా.. అక్కడే ఉన్న టీడీపీ ఏజెంట్లు అడ్డుకుని, ఎన్నికల అధికారులతో వాదనకు దిగారు. టీడీపీ ఏజెంట్లను బయటకు వెళ్లాలని పోలీసులు తెలిపారు. తాము ఏజెంట్లమనీ, తమను ఎలా బయటకు పంపిస్తారంటూ అధికారులను ప్రశ్నించారు. వైసీపీ నాయకులు.. ఓటర్లను ప్రలోభపెడుతున్నా వారిని బయటకు పంపకుండా తమను వెళ్లాలనడం ఏంటని ప్రశ్నించారు. పోలీసులు, ఆర్వో భాగ్యరేఖ.. పార్టీల నాయకులను బయటకు పంపడంతో వివాదం సద్దుమణిగింది. అంతకుముందు వైసీపీ అభ్యర్థి శ్రీధర్ రెడ్డి పోలింగ్ బూత్ వరకు వెళ్లడంపై ఉమ్మడి టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి.. ఆర్వోని నిలదీశారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.3

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. అనంతపురం అర్బన్				
2. రాప్తాడు				
3. శింగనమల				
4. తాడిపత్రి				
5. గుంతకల్లు				
6. ఉరవకొండ				
7. కళ్యాణదుర్గం				
8. రాయదుర్గం				
9. ధర్మవరం				
10. కదిరి				
11. పుట్టపర్తి				
12. పెనుకొండ				
13. హిందూపురం				
14. మడకశిర				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 239-2ఎ, బెంగళూరు బైపాస్, కక్కలపల్లి క్రాస్, అనంతపురము- 515001.

*షరతులు వర్తిస్తాయి



రోడ్‌షోలో నందమూరి వసుంధరాదేవి, లోకేశ్వరి, కుమారుడు శ్రీనివాసులు

సకుటుంబ సమేతం..

హిందూపురం, మే 7 : ఎన్నికల్లో గెలవడం కోసం ఓ వైపు అభ్యర్థులు ప్రచారం చేస్తుంటే.. మరోవైపు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరులు కూడా దూసుకుపోతున్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తరుపున ఆయన భార్య వసుంధరదేవి, కుమార్తెలు నారా బ్రాహ్మిణి, తేజశ్విని, నందమూరి బాలకృష్ణ సోదరి లోకేశ్వరి, కుమారుడు శ్రీనివాసులు, వసుంధర సోదరుడు ప్రసాద్ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. స్వర్ణాంధ్ర సహకార యాత్రలో భాగంగా నియోజకవర్గాల్లో నందమూరి బాలకృష్ణ పాల్గొంటుండగా ఇక్కడ వసుంధరదేవితోపాటు కుటుంబసభ్యులు, బంధువులు ప్రచారం నిర్వహిస్తున్నారు. వైసీపీ అభ్యర్థి దీపికతోపాటు ఆమె భర్త, బంధువులు, ప్రచారంలో పాల్గొంటున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సవిత ఓవైపు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుండగా ఆమె భర్త వెంకటేశ్వర్లు మరోవైపు మండలాలను చుట్టేస్తున్నారు. వారి బంధువులుకూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. వైసీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్‌తోపాటు ఆమె భర్త చరణ్‌రెడ్డి, బంధువులు కూడా ప్రచారంలో నిమగ్నమయ్యారు. హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి, సతీమణి, కుమారుడు, బంధువులు ప్రచారంలో పాల్గొంటున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర ప్రచారంలో ముందుకెళ్తుండగా ఆమె మామ పల్లె రఘునాథ్‌రెడ్డి, భర్త పల్లె కృష్ణకిషోర్ కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక్కడ కూడా వైసీపీ అభ్యర్థి దుద్దేకుంట శ్రీధర్‌రెడ్డితోపాటు సతీమణి, కుటుంబ సభ్యులు ప్రచారంలో పాల్గొంటున్నారు. కదిరిలో తెలుగుదేశం అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, ఆయన సతీమణి యశోదాదేవి ప్రచారంలో దూసుకెళ్తున్నారు.



ఎన్నికల సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ కూతురు తేజశ్విని



అన్నదమ్ముల సవాల్..!

వైసీపీ నుంచి విశ్వ, కాంగ్రెస్ తరపున మధు

ఉరవకొండలో ఆసక్తికర రాజకీయం



మధుసూదన్‌రెడ్డి



విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: ఉరవకొండ శాసనసభ నియోజకవర్గ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. గత ఎన్నికల్లో కలసిమెలసి ప్రచారం చేసిన అన్నదమ్ములు ఈ ఎన్నికల్లో బద్ధ శత్రువులయ్యారు. వైసీపీ అభ్యర్థిగా విశ్వేశ్వరరెడ్డి బరిలో ఉండగా, కాంగ్రెస్ పార్టీ తరపున విశ్వ సోదరుడు మధుసూదన్‌రెడ్డి పోటీలో నిలిచారు. 2004 నుంచి విశ్వేశ్వరరెడ్డికి చేదోడు వాదోడుగా ఉన్న మధు ఈ ఎన్నికల్లో అన్నకు ప్రత్యర్థిగా మారారు. కాంగ్రెస్ నుంచి పోటీచేసి గెలవాలని కాకుడా, తన సోదరుడిని ఓడించాలన్న లక్ష్యంతో మధుసూదన్‌రెడ్డి బరిలో నిలవడం గమనార్హం. అన్నదమ్ములిద్దరికీ పొసగకపోవడంతో మూడేళ్లుగా విరోధులుగా మారారు. ఈ నేపథ్యంలో గత సంవత్సరం వైసీపీ కార్యకర్తల సమావేశంలో విశ్వేశ్వరరెడ్డిపై మధు విమర్శలు చేయడంతో అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. స్తబ్దతగా ఉన్న మధు అన్నపై కక్షతో పీసీసీ చీఫ్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అన్నదమ్ములిద్దరూ వేర్వేరు పార్టీలు తరఫున పోటీ పడుతుండడటంతో ఈ ఎన్నికల్లో టీడీపీకి కలిసి వస్తుందన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వైసీపీ ఓట్లు చీలుస్తారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా శాసనమండలి సభ్యుడు శివరామిరెడ్డి కూడా వైసీపీ తరఫున ప్రచారం చేయడంలేదు. ఆయనతో పాటు ఆయన వర్గీయులు కూడా నియోజకవర్గంలో ఎక్కడా ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోవడం గమనార్హం. ఆయన వర్గీయులు శివరామిరెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి పోటీ చేస్తున్న గుంతకల్లు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఉరవకొండ మేజర్ పంచాయతీలో వైసీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ వార్డు మద్ధతుదారులు ఐదుగురు టీడీపీలోకి చేరారు. ఉరవకొండలో మరికొంత మంది వైసీపీ అసమ్మతి నాయకులు టీడీపీ గూటికి చేరే అవకాశాలు ఉన్నాయని చర్చసాగుతోంది. ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ ఉండడటంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. గత ఎన్నికల ఫలితాలను గమనిస్తే అతి తక్కువ ఓట్ల తేడాతోనే ఎమ్మెల్యేగా గెలుపు సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీలో శివరామిరెడ్డి వర్గం విశ్వకు ముఖం చాటేయడం, సొంత సోదరుడు మధు కాంగ్రెస్ నుంచి పోటీలో ఉండడం తదితర కారణాలతో ఈసారి టీడీపీ విజయం తథ్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రసవత్తరంగా ధర్మవరం పోరు



ధర్మవరం పట్టణ ముఖచిత్రం




సత్యకుమార్ యాదవ్



కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం

ఇసుక, మట్టి, భూకబ్జాలపై జనాగ్రహం
మార్పు కోరుకుంటున్న ప్రజలు
ఎమ్మెల్యే కేతిరెడ్డి తీరుపై విమర్శలు
సత్యకుమార్‌యాదవ్, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మధ్యే పోటీ



ఎమ్మెల్యే కేతిరెడ్డి ఏర్పాటు చేసుకున్న ఎర్రకోట

ధర్మవరం నియోజకవర్గంలో ఈసారి పోటీ రసవత్తరంగా మారింది. కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రధానంగా పోటీలో ఉన్నారు. వీరిద్దరి మధ్య పోటాపోటీ నెలకొంది. ధర్మవరం నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుంచి 15సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1983, 1985, 1989, 1994, 2004, 2014లో టీడీపీ జెండా ఎగిరింది. 1955, 1962, 1972, 1978, 1999, 2009 కాంగ్రెస్, 2019లో వైసీపీ గెలిచింది. నియోజకవర్గంలో ధర్మవరం పట్టణంతో పాటు ధర్మవరంరూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలు 290 ఉన్నాయి. 35 సెక్టార్లు, 35 రూట్స్ ఉన్నాయి. మొత్తం ఓటర్లు 2,45,758 మంది ఉండగా ఇందులో పురుషులు 1,21,764 మంది, మహిళలు 1,23,974 మంది, థర్డ్ జండర్ 20 మంది ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాలో రూ.వందల కోట్లు..!

ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు రీచ్ నుంచి ఇసుకను తోడేసీ బత్తలపల్లి నల్లబోయనపల్లి వద్ద డంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి పట్టపగలే కర్ణాటకకు తరలిస్తున్నారు. కర్ణాటకలో టిప్పర్ రూ.70వేలకు వరకు అమ్ముకుంటున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో రేషన్ బియ్యం, గుట్కా, మట్టి తదితర వాటిని కూడా ఎమ్మెల్యే అనుచరులు అక్రమంగా రవాణా చేసి కోట్లలో దండుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

స్థలం కనిపిస్తే కబ్జాలే

నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు, అనుచరులు స్థలాలు కనిపిస్తే కబ్జాలు చేస్తారని ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యే తుంపర్తి గ్రామ ఎస్సీలకు చెందిన 20 ఎకరాలు బెదిరించి తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో పాటు అక్కడే మరికొన్ని భూములను తన కుటుంబసభ్యుల పేరిట నకిలీ పట్టాలు సృష్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యేతోపాటు నియోజకవర్గంలో ఆయన అనుచరులు కూడా ప్రభుత్వ భూములు, అసైన్డ్, డీకేటీ భూములను సైతం వదలడంలేదని, కబ్జాలు చేస్తున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గుడ్‌మార్నింగ్ పేరుతో వార్డు, గ్రామాల్లో సైతం ఖాళీ స్థలాలు కనిపిస్తే కబ్జాలు చేసేస్తున్నారని ప్రచారం సాగుతోంది.

సొంత పార్టీలో ఎమ్మెల్యేపై వ్యతిరేకత

స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి సొంత పార్టీలో వ్యతిరేకత ఉంది. ఇటీవల వైసీపీకి చెందిన బలమైన నేతలు ధర్మవరం పట్టణానికి చెందిన వైసీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిర్రాజు నగేశ్, బత్తలపల్లికి చెందిన కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాశ్‌బాబు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్, చందారాఘవ తదితరులు బీజేపీలోకి చేరారు. దీంతో కూటమి బీజేపీ అభ్యర్థి గెలుపు సునాయాసమవుతుందని వారు ధీమాగా ఉన్నారు. దీనికి తోడు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, టీడీపీ అధినేత చంద్రబాబు ధర్మవరం పర్యటన కూడా కూటమి అభ్యర్థికి కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు.

బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ బలాలు

సత్యకుమార్‌యాదవ్ బీజేపీ జాతీయస్థాయి నాయకుడిగా ఉండటం.
కేంద్రంలోని పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉండటం.
ముఖ్యంగా నియోజకవర్గంలో బీసీ కార్డు బలంగా ప్రజల్లోకి వెళ్లడం.
వైసీపీ నుంచి బలమైన నేతలు బీజేపీలో చేరడం.
ఏదైన అనుకుంటే సాధించేవరకు పట్టువదలని విక్రమార్కుడు అన్న పేరు.

బలహీనతలు

ధర్మవరానికి ఎన్నికల ముందు రావడం.
ప్రజల్లో కొత్తవ్యక్తిగా ప్రచారం జరగడం.
ప్రత్యక్ష ఎన్నికల్లో మొదటిసారి పోటీ
నాన్‌లోకల్ అన్న అభిప్రాయం.

ఎమ్మెల్యే కేతిరెడ్డి బలాలు

జగన్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు
స్థానికంగా అందుబాటులో నిత్యం ఉండటం
తనకంటూ ప్రత్యేక బలాన్ని చేకూర్చుకోవడం

బలహీనతలు

చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి అమలుచేయకపోవడం.
వైసీపీలో వ్యతిరేకత, బలమైన నేతలు పార్టీని వీడడం.
ప్రభుత్వ అసైన్డ్, డీకేటీ భూములు కబ్జాలు చేయడం.
ఎదిరించిన వారిపై దాడులు, అక్రమ కేసులు బనాయించడం.

టీడీపీతోనే శాంతియుత పాలన

అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ



విడపనకల్లులో మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

గుంతకల్లు, మే 7: రాష్ట్రంలో పెరిగిపోయిన అరాచకాలు, దౌర్జన్యాలకు చరమగీతం పాడటానికి టీడీపీకి ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని అనంతపురం కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ ఓటర్లను కోరారు. మంగళవారం గుంతకల్లుకు వచ్చిన అంబికా పట్టణంలోని డీఆర్‌ఎం కార్యాలయం, డీజిల్ షెడ్, రైల్వే ఎలక్ట్రికల్ కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ తరఫున ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో నిలిచిన తనకు, గుమ్మనూరు జయరాంకు ఓట్లు వేసి గెలిపించాలంటూ అంబికా ప్రచారం చేశారు. అనంతరం మార్వాడీలు, ఆర్యవైశ్య ప్రముఖులతో భేటీ అయ్యి ఎన్నికల్లో తమకు మద్దతునివ్వాలని కోరారు. టీడీపీ ద్వారానే రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందని, వ్యాపార వర్గాలు స్వేచ్ఛాయుతంగా కార్యకలాపాలు నిర్వహించుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పత్తి హిమబిందు, ముష్టూరు తిమ్మప్ప, పూల రమణ, గోవిందరాజులు, ముష్టూరు బాలాజీ సింగ్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని పార్లమెంట్ కూటమి అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వజ్రకరూరు మండలంలోని చాయాపురం, వజ్రకరూరులో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే కూటమి కలయిక అన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు ద్వారా భావితరాల మార్పునకు నాంది పలకాలన్నారు. ఈ నెల 13వ తేదీతో రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదిలిపోతుందన్నారు. దుర్మార్గపాలనను తరిమికొట్టేందుకు ఇక మిగిలింది నాలుగు రోజులే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగభూషణం, దస్తగిరి, వలి, గురుమూర్తి, సర్పంచ్ మనోహర్, రఘు, నారాయణస్వామి పాల్గొన్నారు.

విడపనకల్లు: సీఎం జగన్ రాష్ట్ర ప్రజానికానికి ఈ ఐదేళ్ల కాలంలో నరకం ఏమిటి అనేది చూపించాడని అనంతపురం టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని విడపనకల్లు గ్రామంలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబికా మాట్లాడుతూ ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్‌కు, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అయిన తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజనేయులు, హనుమంతు, బీడీ చిన్న మారయ్య, భీమలింగప్ప, జనార్దననాయుడు, చంద్రశేఖర్, డి. దేవేంద్ర, విజయ్‌శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంఎస్‌తో ఓటర్ స్లిప్

అనంతపురంరూరల్: క్షేత్రస్థాయిలో చాలా మంది ఓటర్ స్లిప్పులు అందలేదంటూ గాబారపడుతుంటారు. ఈ ఇబ్బంది లేకుండా ఈసారి ఎన్నికల సంఘం ఎస్ఎంఎస్ ద్వారా ఓటర్ స్లిప్ సమాచారం ఇచ్చింది. మొబైల్ ఫోన్‌లో ఈసీఐ అనిటైప్ చేసి స్పేస్ ఇచ్చి ఓటర్ ఐడీ నెంబరు ఎంటర్ చేసిన తరువాత 1950కి మెసేజ్ పంపిస్తే చాలు. సదరు ఓటరు పోలింగ్ బూత్ నెంబరుతోపాటు ఆ బూత్ ఓటర్ జాబితా, ఓటర్ సీరియల్ నెంబరుతో కూడిన మెసేజ్ వస్తుంది. పదిహేను సెకెన్లలో సమాచారం ఫోన్‌కు ఎస్ఎంఎస్ ద్వారా వస్తుంది.

అక్కడ చైతన్యం ఎక్కువ..?



రాళ్ల అనంతపురంలో పోలీసు కవాతు

కంబదూరు మండలంలోని ఆ గ్రామాలలో ప్రచారం చేసే సమయంలో ఏ పార్టీ అభ్యర్థులైనా ఆచితూచి అడుగులేస్తారు. సమస్యలపై ప్రశ్నించే చైతన్యం అక్కడి ప్రజల్లో ఉండటమే దీనికి కారణం. ఒకప్పటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన అచ్చంపల్లి, చెన్నంపల్లి, కురాకులపల్లి, అయ్యంపల్లి, రాళ్ల అనంతపురం, నర్సీపురం, రాళ్లపల్లి తదితర గ్రామాలలో సమస్యలపై రాజకీయ నాయకులను నిలదీసిన సంఘటనలు చాలా ఉన్నాయి. సమస్యలను పరిష్కరిస్తారా..? లేదా..? అని ఇక్కడి ప్రజలు సూటిగా ప్రశ్నిస్తారు. మాజీ ఎమ్మెల్యే శారదమ్మను రాళ్ల అనంతపురంలో మావోయిస్టులు అప్పట్లో ఓసారి నిర్బంధించారు. ఈ మండలంలో పలువురు నాయకులను అప్పట్లో మావోయిస్టులు ఎత్తుకువెళ్లి.. పద్ధతిగా ఉండాలని హెచ్చరించి పంపిన సంఘటనలు ఉన్నాయి. కురాకులపల్లిలో గత ఎన్నికల ప్రచార సమయంలో ఇరువర్గాల నిలదీతలు, ఫిర్యాదులు తారస్థాయికి చేరి.. రాళ్లదాడుల వరకూ వెళ్లాయి. ఇప్పుడు మావోయిస్టుల ప్రభావం లేకపోయినా.. ఆ చైతన్యపు వాసనలు మాత్రం పోలేదు. కొందరు మాజీ నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. వివిధ పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. సున్నితమైన ఈ గ్రామాలపై పోలీసుల నిఘా కూడా ఎక్కువగా ఉంది.

- కళ్యాణదుర్గం

ఎస్సీ, ఎస్టీ ఓటర్లకు రక్షణ

అనంతపురం అర్బన్: షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (దౌర్జన్యాల నిరోధక) చట్టం మేరకు ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన వర్గాల ప్రజలను ఎన్నికల్లో తాము చెప్పిన అభ్యర్థికి ఓటు వేయాలని, మరో వ్యక్తికి ఓటు వేయకూడదని లేదా ఆ వర్గాల వారు అభ్యర్థిగా నిలబడకూడదని బలవంతం చేసినా, బెదిరించినా, హెచ్చరించినా అలాంటి వ్యక్తులు శిక్షార్హులవుతారు. ఈ నేరాలకు 6 నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తారు. బలహీన వర్గాల ఓటర్లు ముఖ్యంగా ఎస్సీలు, ఎస్టీలు తదితర ఓటర్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది.

గురువుల జేబుకు చిల్లు

జగన్ ప్రభుత్వ నిర్వాకంతో ఆర్థిక ఇబ్బందులు
పాఠశాలలకు ఎస్ఎంసీ నిధుల విడుదలలో మొండిచేయి
పైసా ఇవ్వకుండానే విద్యా సంవత్సరం ముగింపు

కళ్యాణదుర్గం: జగన్ ప్రభుత్వం చెత్త రికార్డుతో 2023-24 విద్యాసంవత్సరాన్ని ముగించింది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పాఠశాలల నిర్వహణకు ఒక విద్యా సంవత్సరం పైసా ఇవ్వకుండానే బడులకు సెలవులు ఇచ్చింది. పదిన్నర నెలల పాటు బడుల నిర్వహణకు గురువులే తమ జేబులోని డబ్బులు వెచ్చించాల్సి వచ్చింది. విద్యుత్ చార్జీల భారం మోయలేక వారు తిప్పలు పడాల్సి వచ్చింది. పాఠశాలల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని పాఠశాల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఫలితంగా విద్యుత్ శాఖ నుంచి అందిన నోటీసులకు భయపడి విద్యుత్ బిల్లులను ప్రధానోపాధ్యాయులే చెల్లించారు. చివరకు సుద్దముక్కకు కూడా జగన్ ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. తెల్లకాగితాలు, రికార్డు పుస్తకాలు, చీపుర్లు, ఇతర సామగ్రికి సైతం గురువులే సొంత డబ్బులు వెచ్చించాల్సి వచ్చింది. గత విద్యాసంవత్సరంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) గ్రాంట్ కింద ఇవ్వాల్సిన నిధులలో 50 శాతమే ఇచ్చారు. ప్రస్తుతం ముగిసిన విద్యాసంవత్సరంలో పైసా ఇవ్వలేదు. దీంతో ఆ డబ్బులు వస్తాయా లేదా అన్న అనుమానాన్ని గురువులు వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సొంత డబ్బులు రూ. 1.20 లక్షల వరకు వెచ్చించారు. కంబదూరు మండలంలోని ఓ పాఠశాలలో పని చేస్తున్న మరో హెచ్‌ఎం రూ. 10 వేలు సొంత డబ్బులు వెచ్చించి విద్యుత్ బకాయిలు చెల్లించారు. ఇక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రూ. 50 వేలు నుంచి రూ. 1.50 లక్షలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూ. 10 వేలు నుంచి రూ. 25 వేలు వరకు జేబుల్లో నుంచి ఖర్చుచేశారు. గత నెలలో విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించకుంటే ఫ్యూజులు పీకేస్తామని విద్యుత్ శాఖ అధికారులు నోటీసులిచ్చారు. దీంతో విద్యుత్ లేకపోతే బడి నడవదని భావించి హెచ్‌ఎంలు వాటిని చెల్లించారు. బకాయిలు వుంటే జరిమానాలు ఎక్కువ పడుతున్నాయనే భయంతో ఎక్కువ మంది విద్యుత్ బిల్లులు చెల్లించి ఎస్ఎంసీ గ్రాంట్ల కోసం ఎదురుచూశారు. గత యేడాదికి సంబంధించి 45 పాఠశాలలకు రూ. 50 లక్షల వరకు బకాయిలు రావాల్సి వుంది. ప్రధానోపాధ్యాయులు జేబులు ఖాళీ చేసిన ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

హామీ మరిచిన మంత్రి

నాడు-నేడు కింద పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసిన తరువాత విద్యుత్ బిల్లులు మోయలేని విధంగా వున్నాయని ఉపాధ్యాయ సంఘాల నాయకులు గతేడాది జూలైలో మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలల విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందని, మీరు బిల్లులు చెల్లించవద్దని హెచ్‌ఎంలకు మంత్రి హామీ ఇచ్చారు. ఆ మాటలు నమ్మి గతేడాది ఆగస్టు నుంచి పాఠశాలలు విద్యుత్ బకాయిలు చెల్లించలేదు. పాఠశాల నిర్వహణకు విద్యుత్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్న ఉత్తర్వు ఇప్పటి వరకు జారీ చేయలేదు. దీంతో తమకు ఎలాంటి ఉత్తర్వు రాలేదని, బకాయిలు చెల్లించాల్సిందేనని విద్యుత్ శాఖ ప్రధానోపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడంతో చేసేదేమీ లేక గత నెలలో ఎక్కువ మంది చెల్లించారు.



మడకశిరను ఉద్యానహబ్‌గా తీర్చిదిద్దుతాం

- ప్రతి ఎకరాను సాగులోకి తీసుకువస్తాం
- వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి
- టీడీపీతోనే అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి
- హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి



మడకశిర నియోజకవర్గంలో బీకే ప్రచారం

పుట్టపర్తి, మే 7(ఆంధ్రజ్యోతి): మడకశిరకు నేరుగా హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి చెరువును నింపి, ప్రతి ఎకరాను సాగులోకి తీసుకువస్తామని హిందూపురం లోక్‌సభ టీడీపీ కూటమి అభ్యర్థి బీకే పార్థసారథి హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మడకశిర నియోజక వర్గంలోని అగళి మండలంలో అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎస్‌రాజుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ మడకశిర నియోజక వర్గంలో సారవంతమైన ఉద్యానవన పంటలకు సాగు అనుకూలమైన భూములు ఉన్నాయన్నారు. టీడీపీ హయాంలోనే మడకశిరకు గొల్లపల్లి నుంచి మడకశిర ఉప కాలువ ద్వారా హంద్రీనీవా నీరు ఇచ్చామన్నారు. చుట్టూ తిరిగివచ్చి మడకశిర ప్రాంతానికి నీరు చేరాలంటే ఆలస్యంతో చెరువుల్ని నింపలేని పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్య లేకుండా తురకాపట్నం నుంచి నేరుగా మడకశిరకు కాలువ తవ్వి నీరిస్తామని హామీ ఇచ్చారు. నీరు వస్తే ఉమ్మడి జిల్లాలోనే వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో మడకశిర ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కల సాకారం కావాలంటే రాష్ట్రంలో టీడీపీ కూటమి కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలో వస్తేనే సాధ్యమవుతుందన్నారు. అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నరలోగా మడకశిరకు నేరుగా కాలువ నిర్మాణం చేపట్టి నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. మడకశిర పల్లెల్లో బీకే ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ, బీజేపీ, జనసేప కూటమి శ్రేణులు పాల్గొన్నారు. అదే విధంగా పుట్టపర్తి నియోజక వర్గం తలమర్లలో పుట్టపర్తి టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డితో కలిసి బీకే రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ ఐదేళ్లగా రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసీపీకి ప్రజలు ఓటు ద్వారా ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీతోనే అన్ని వర్గాల సంక్షేమని, కూటమికి ఘన విజయం అందించాలని కోరారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
అనంతపురం
శ్రీ సత్యసాయి
బుధవారం 8 మే 2024

పోలింగ్ తర్వాత..



అనంతపురం అర్బన్: పోలింగ్ పూర్తయిన తర్వాత స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు తరలిస్తారు. పోలింగ్ ముగిసిన తర్వాత ప్రిసైడింగ్ అధికారి ఈవీఎం కంట్రోల్ యూనిట్ క్లోజ్ బటన్‌ను నొక్కాలి. దీంతో తర్వాత ఓటు వేసేందుకు ఆస్కారం ఉండదు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లను క్యారీయింగ్ కేసులలో ఉంచి సీలు వేస్తారు. ఆ సీళ్లపై పోలింగ్ ఏజెంట్లతో సంతకం చేయిస్తారు. పోలింగ్ రోజున పోలైన మొత్తం ఓట్లు, సీళ్లతోపాటు పోలింగ్‌కు ఉపయోగించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్ల క్రమ సంఖ్యల వివరాలున్న ఫారం - 17 సీ కాపీని పోలింగ్ ఏజెంట్లకు అందజేస్తారు. పోలయిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లను అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలో డబుల్ లాక్ సిస్టమ్‌లో భద్ర పరిచి స్ట్రాంగ్ రూంకు పంపిస్తారు. ఈ సన్నివేశాన్ని వీడియో తీస్తారు. పోలింగ్‌స్టేషన్ నుంచి రిసెప్షన్ సెంటర్‌కు ఈవీఎంలు, వీవీ ప్యాట్లను తీసుకువెళ్లే వాహనాలను అనుసరించేందుకు అభ్యర్థులు లేదా ఏజెంట్లకు అనుమతిస్తారు. అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు స్ట్రాంగ్ రూం ముందు నిర్దేశించిన ప్రాంతంలో క్యాంప్‌లు వేసుకోవచ్చు. స్ట్రాంగ్ రూంలు నిత్యం సీసీటీవీ కవరేజ్‌లో ఉంటాయి.

48 గంటల ముందు..



అనంతపురం అర్బన్: పోలింగ్ ముగింపునకు 48 గంటల ముందు ప్రచారాలు బంద్ చేయాలి. అప్పటి నుంచి ఎలాంటి లౌడ్ స్పీకర్లను ఉపయోగించకూడదు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రచారం అనుమతి రోజుల్లో ప్రతిరోజు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు, ఇతర సౌండ్ పరికరాలను ఉపయోగించకూడదు. అలాగే బాల కార్మిక చట్టం మేరకు ఎన్నికలకు సంబంధించిన పనుల్లో పిల్లలను ఉపయోగించకూడదు. ఎన్నికల ప్రచారాలు, రాజకీయ చర్చల్లో దివ్యాంగులను కించపరిచేలా పదాలు వాడకూడదు.

మాస్ రూ. 5 వేలు.. క్లాస్ రూ.2 వేలు



అనంతపురం రూరల్ : ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఓటర్లకు డబ్బులతో ఎర వేసేందుకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో రాప్తాడు నియోజకవర్గంలో ఇప్పటికే ఓటర్లకు డబ్బులు ఎలా పంపిణీ చేయాలన్నదానిపై ఓ కొలిక్కి వచ్చినట్లు గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికార పార్టీ వారు మాస్ ఏరియాల్లో ఓటుకు రూ.5వేలు.. క్లాస్ ఏరియాల్లో ఓటుకు రూ.2వేలు చొప్పున పంపిణీ చేయడానికి సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ మేరకు సూచనప్రాయంగా స్థానిక నాయకులకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. వలంటర్లతో ఈ పంపిణీ తంతు సాగించాలని చూస్తున్నట్లు సమాచారం. వలంటీర్లకు ఎవరు ఏపార్టీ.. ఎవరు మధ్యస్థంగా ఉంటారన్న వివరాలు వారి దగ్గర ఉండటంతో.. వారితోనే డబ్బులు పంపిణీ చేయాలని అధికార పార్టీ నాయకులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అందుకే వారితో రాజీనామా చేయించినట్లు సమాచారం. వలంటీర్ల వెంట అధికార పార్టీ నాయకులు ఒకరిద్దరు వెళ్లి పని కానిచ్చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

ఆర్ఓ తీరుపై అనుమానాలు..!

- గెజిటెడ్ సంతకం పెట్టి సీల్ వేయకుండానే ఓటింగ్
- తొలిరోజు రాప్తాడులో ఇలాగే బ్యాలెట్ పోలింగ్
- సంతకం లేకపోతే చెల్లవంటున్న కలెక్టర్
- ఫిర్యాదుకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయులు



అనంతపురం టౌన్ : జిల్లా కేంద్రంలో ఓ రిటర్నింగ్ ఆఫీసర్ తీరుపై ఇటు ఉపాధ్యాయులు అటు తెలుగుదేశంపార్టీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మొదలైనప్పటి నుంచి అధికార వైసీపీకి మేలు చేయడానికి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు ఆ కేంద్రంలో వినిపిస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితా జారీ చేయడంలోను, సీరియల్ నెంబర్లతో తయారు చేసిన జాబితా ఇచ్చి టీడీపీ వారికి కామన్ జాబితా ఇచ్చి పేర్లు చూసుకోవడానికి ఇబ్బందులు కలిగేలా చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు. పైగా ఆ పార్టీనేతలు, అనుకూల సంఘాల నాయకులు అక్కడే ఉండి ఓటర్లకు డబ్బులు పంచుతున్నా ఏమీ పట్టనట్లు సాగుతున్నారు. తాజాగా ఓట్ల పోలింగ్ విషయంలో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ ఓట్లు నిబంధనలకు విరుద్ధంగా వేయించినట్లు వారు ఆరోపిస్తున్నారు. ఇందుకు ఆదివారం చోటుచేసుకున్న వ్యవహారమే నిదర్శనమని అంటున్నారు. ఓటర్ల సంఖ్య పెరగడంతో పోలింగ్ సెంటర్లు పెంచాలని కోరుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో జూనియర్ కళాశాలలో మరో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 3వ కౌంటర్‌లో మధ్యాహ్నం 3-30 గంటలకు ప్రారంభం కాగా.. అపుడు అక్కడికి ఓటర్లు వెళ్లి ఓటు వినియోగించుకున్నారు. నిబంధనల మేరకు గెజిటెడ్ సంతకంతోపాటు అధికారి సీల్ వేయాల్సి ఉంటుంది. ఇక్కడ అధికారి కేవలం సంతకం పెట్టి ఓటు వేయించారు. విషయం తెలుసుకున్న కొందరు ఉపాధ్యాయులు వెళ్లి అడిగినా తానే ఆర్ఓ అనీ, తాను సంతకం పెడితే చాలు చెల్లుతుందని చెప్పి పంపించారు. దాదాపు 50 మంది వరకు అక్కడ అలాగే ఓటు వేశారంటున్నారు. ఇపుడు ఈ విషయం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళితే గెజిటెడ్ ఆఫీసర్ సంతకం పెడితే సరిపోదు.. సీల్ వేయాలనీ, అపుడే ఓటు చెల్లుతుందని స్పష్టం చేశారు. అలా లేకపోతే చెల్లని ఓట్లుగానే పక్కన పెట్టాల్సి వస్తుందంటున్నారు. శిక్షణలో పక్కాగా చెప్పామనీ, అలా చేసి ఉందుంటే మాత్రం తప్పకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అంటున్నారు. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కావాలనే చెల్లనివిగా మార్చిన ఆర్ఓపై ఫిర్యాదు చేయడానికి ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు.

ఎరువుల ధరలు రెట్టింపు



భగవాన్, రైతు, నింబగల్లు

జగన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చేది కొంత, చెప్పేది కొండంత. ఐదేళ్లలో ఎరువుల ధరలు రెట్టింపు పెరిగాయి. కాలానుగుణంగా వచ్చే తెగుళ్ల కారణంగా రైతులకు ఏటా పెట్టుబడులు పెరుగుతున్నాయి. దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఆదాయం కన్నా ఖర్చులే ఎక్కువ. లాభసాటిగా ఉండాల్సిన వ్యవసాయం నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. గతంలో వ్యవసాయ యంత్రాలు రాయితీపై ఇచ్చేవారు. రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. ఇప్పుడు వాటి ఊసేలేదు.

- ఉరవకొండ

ఐఓసీగా నిధులను దిగమింగారు..!

- వాటర్ ప్లాంట్ల ఏర్పాటులో వైసీపీ నాయకుల చేతివాటం
- నాసిరకం పరికరాలతో మూలనపడిన నీటి శుద్ధి ప్లాంట్లు





నక్కనదొడ్డి వద్ద ఏర్పాటైన ఐఓసీ గిడ్డంగి

గుంతకల్లు: తాగునీటి సమస్యను తీర్చడానికి ఐఓసీ ఇచ్చిన నిధులను అధికార పార్టీ నాయకులు అప్పనంగా దిగమింగి జేబులు నింపుకున్నారు. గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి పంచాయతీలో ఏర్పాటైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇంధన గిడ్డంగి సంస్థ మూడు గ్రామాల్లో శుద్ధిచేసిన నీటిని అందించడానికి రూ. లక్షల నిధులను ఇచ్చింది. ఆ నిధుతో మూడు గ్రామాల్లో మూడు నీటిశుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. గ్రామస్థుల సంక్షేమం కోసం ఐఓసీ నుంచి నిధులు విడుదల కాగానే వైసీపీ నాయకులు రంగ ప్రవేశంచేసి నాసిరకం ప్లాంట్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అనతి కాలంలోనే ఆ మూడు వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్లు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. దీంతో నక్కనదొడ్డి పంచాయతీలోని గ్రామాలకు తాగునీటి సమస్య ఏర్పడింది. సామాజిక సేవా కార్యక్రమం కింద ఐఓసీ ఇచ్చిన నిధులను కూడా దిగమింగిన వైసీపీ నాయకులు జేబులు నింపుకోగా, వారెంటీలు ఉన్నా కూడా ఆ ప్లాంట్లను పట్టించుకునేవారు కరువయ్యారు. ప్లాంట్ల కోసం వెచ్చించిన రూ. 25 లక్షల్లో దాదాపు సగం కాజేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇదీ జరిగింది..

గుంతకల్లు పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న ఐఓసీ ఇంధన గిడ్డంగిలో భద్రతా ప్రమాణాలు లోపించాయంటూ వచ్చిన నివేదిక కారణంగా అక్కడ ఇంధన దిగుమతిని 2019లో నిలిపివేశారు. ప్రత్యామ్నాయంగా మండలంలోని నక్కనదొడ్డి గ్రామం వద్ద 81.75 ఎకరాల భూమిని సేకరించి రూ. 350 కోట్ల వ్యయంతో భారీ స్థాయిలో నూతన గిడ్డంగిని నిర్మించడానికి ఐఓసీ నిర్ణయించింది. రైతుల నుంచి భూమిని సేకరించిన సమయంలో స్థానికులకు ఐఓసీ కొన్ని హామీలిచ్చింది. అందులో భాగంగా ఈ పంచాయతీలోని నక్కనదొడ్డి, ఎన్.కొట్టాల, ఎన్.తండా గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిషరిస్తామంటూ ఐఓసీ అధికారులు మాట ఇచ్చారు. చెప్పిన ప్రకారం 2021లో ఒక్కో వాటర్ ప్లాంటుకు రూ. 8.25 లక్షల చొప్పున మొత్తం దాదాపు రూ. 25 లక్షలు విడుదల చేసింది. అంతే ఈ పంచాయతీలోని వైసీపీ నాయకులు రంగప్రవేశంచేశారు. నాసిరకం నీటి శుద్ధి యంత్ర పరికరాలను తెచ్చి నక్కనదొడ్డి, ఎన్. కొట్టాల, ఎన్.తండా గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేశారు. ఈ మూడు ప్లాంట్లలో ఒకటి మూడు నెలలు, మిగతా రెండు ఆరు నెలలు తిరక్కుండానే మూలనపడ్డాయి.

వారెంటీ ఉన్నా వృథాయే..

నక్కనదొడ్డి పంచాయతీలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లకు సంవత్సరంపాటు వారెంటీలు ఉన్నాయి. కానీ అనతి కాలంలోనే ఇవి పనిచేయక మొరాయించాయి. మూడు ప్లాంట్లకు మోటార్లు పనిచేయకుండా పోయాయి. నక్కనదొడ్డి, ఎన్. కొట్టాల ప్లాంట్లు ఇప్పటికీ వృథాగా పడి ఉండగా, ఎన్.తండాలో ఓ వ్యక్తి ప్రజల వద్ద శుద్ధి చేసిన నీటికి డబ్బు వసూలు చేస్తూ దాన్ని నిర్వహిస్తున్నాడు. నక్కనదొడ్డి గ్రామంలో బోరులోకి మోటారు జారిపోయిందంటూ చేతులు దులుపుకున్నారు. ఎన్.కొట్టాలలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. ఎన్.తండాలో ఓ వ్యక్తి ప్లాంటును రిపేరు చేయించి బిందె రూ. 5 లెక్కన అమ్ముతూ ప్లాంటును ఎలాగోలా నిర్వహిస్తున్నాడు. అలాగే నక్కనదొడ్డి గ్రామంలో ఐఓసీ ఏర్పాటు చేసిన ప్లాంటుకు సమీపంలోనే బోరు వేయించి, సొంతంగా వాటర్ ప్లాంటును ఏర్పాటు చేసి నీటిని ప్రజలకు అమ్ముతున్నాడు. కానీ లక్షలు వెచ్చించి వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన ప్లాంట్లు మాత్రం ఎందుకూ పనికిరాకుండాపోయాయి. ఈ ప్లాంట్లకు ఏర్పాటు చేసిన కొత్త మోటార్లను తొలగించేసి, పాత మోటార్లు బిగించారని, అందుకే కొన్నాళ్లు కూడా అవి పనిచేయకుండా పోయాయని, రూ. 25 లక్షల్లో సగం డబ్బు వైసీపీ నాయకులు నొక్కేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



ఎన్.తండాలో స్థానికుడు మరమ్మతు చేసిన ప్లాంటు



నక్కనదొడ్డిలో మూతబడిన వాటర్ ప్లాంటు

ఆరు నెలలు కూడా నడవలేదు



నక్కనదొడ్డి గ్రామంలోని బీసీ కాలనీలో ప్లాంటు ఏర్పాటు చేసిన ఆరు నెలలు గడవక ముందే పనిచేయకుండా పోయింది. మరమ్మతులు చేసేటప్పుడు మోటారు లోనికి జారిపోయిందని చెప్పి ప్లాంటును వృథాగా వదిలేశారు. లక్షలు గుమ్మరించి తెచ్చిన ప్లాంటును ఇలా ఎందుకూ పనికి రాకుండా చేయడం తగదు.

- యు. పార్వతమ్మ, నక్కనదొడ్డి

ప్లాంటును పునరుద్ధరించాలి



ప్లాంటు మూడేళ్ల నుంచి పనిచేయకుండా నిలిచిపోయింది. ప్రైవేటు వ్యక్తి తన సొంత ప్లాంటును పక్కనే ఏర్పాటు చేసినందున తాగునీరు లభిస్తోంది. లేదంటే కేవలం ఐఓసీ ప్లాంటుపై ఆధారపడి ఉంటే గుక్కెడు మంచినీరు దొరక్క అధ్వానమై పోయేవాళ్లము.

- గంగమ్మ, నక్కనదొడ్డి





చందకచర్ల, వైబీ హళ్లిలో మూతపడిన ప్లాంట్లు



టీడీపీ వారి నీరట..!

మినరల్ వాటర్ ప్లాంట్‌లను మూసేశారు

మడకశిర రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన శుద్ధనీటిని అందించడం కోసం తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పంచాయతీ కేంద్రాల్లో తొమ్మిది ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. బిందె నీటిని రెండు రూపాయలకే అందించారు. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత మడకశిర మండలంలోని వాటర్ ప్లాంట్లు కొన్ని సక్రమంగా పరిచేయకపోగా, మరికొన్ని మూతపడ్డాయి. వైబీ హళ్లిలో మంచి నీటి ప్లాంటు మూతపడి మూడు సంవత్సరాలతోంది. చందకచర్లలో ప్లాంటు మూతపడి దాదాపుయేడాది అవుతోంది. పంచాయితీలో నిధులు కొరత కారణంగా విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోవడం, చెడిపోయిన ప్లాంట్లను మరమ్మతులు చేయించకపోవడంతో కొన్ని మూతపడగా, మరికొన్ని అస్తవ్యస్తంగా నడుస్తున్నాయి. ప్రస్తుతం బిందె నీటిని రూ.5కు విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు వైసీపీ ప్రభుత్వపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నేతలూ.. గుర్తుందా..?

- మరో వరద రావాలేమో
- ఏడాదిన్నర దాటినా బ్రిడ్జి నిర్మాణం ఏదీ..?
- పూడిక తీయలేని దౌర్భాగ్యం
- ఆరో రోడ్డులో బ్రిడ్జికి ప్రతిపాదనలతోనే సరి

అనంతపురం క్రైం: విపరీత వర్షం.. నడిమివంక ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడిక, చెత్తా చెదారం...కాలువ నిండి కాలనీల్లోకి వరద నీరు.. 2022 అక్టోబరులో అనంతపురం నగర శివారులోని ఏడెనిమిది కాలనీలను ముంచెత్తింది. వరద నీరు ఇళ్లల్లో చేరడంతో ఆయా కాలనీల ప్రజలు అల్లాడిపోయారు. కనీసం నీరు, తిండి తెచ్చుకోలేని పరిస్థితి. ఇంట్లోని నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. టీవీలు, ఫ్రిడ్జిలు, బైక్‌లు, కారులు పనికి రాకుండా పోయాయి. కొన్ని కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వచ్చింది. స్థానిక ప్రజల కళ్ల ముందు ఇంకా వరద దృశ్యాలు మెదులుతున్నాయి. ఆ వరదలు సృష్టించిన బీభత్సం ఇంకా కాలనీవాసులను భయానికి గురి చేస్తోంది. వర్షాకాలం వస్తోందంటే ఆ కాలనీవాసుల్లో వణుకు పుడుతోంది. ఆ సమయంలో సోమనాథ్‌నగర్, రంగస్వామినగర్, రజకనగర్, లెక్చరర్స్‌కాలనీ, శ్రీశ్రీ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు నరకం చూశారు. మూడు, నాలుగు రోజులు వరద నీరు వెళ్లలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నేతలు, అధికారులు ఏం చేశారు...?

వరదలొచ్చిన సమయంలో ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, ఎస్పీ, నగర కమిషనర్, ఇతర అధికారులు అక్కడికి వెళ్లారు. ప్రతి ఒక్కరూ ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశారు. కానీ వారికి కేవలం నిత్యావసర సరుకులు, వసతి లేని వారికి ఆ సౌకర్యం కల్పించారంతే. కొన్ని రోజుల తరువాత ఏదో చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు అతీగతీ లేదు. ఆ వరదలకు ప్రధాన కారణం నడిమివంకలో పూడిక తీయకపోవడమే. ఆక్రమణలతో అది మరింత కుంచించుకుపోతున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. కాలువ పక్కనే ఉన్న ఇళ్లకు రక్షణగా గోడ ఎత్తును పెంచుతామని చెప్పిన అధికార పార్టీ వైసీపీ నేతలు ఆ విషయమే తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. వరదల తరువాత ఒక్కసారి కూడా పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో కాలువ నిండా పిచ్చి మొక్కలు, చెట్లతో నిండిపోయింది. ఆ పూడిక తీస్తే కానీ మాలో ఆందోళన తగ్గదని స్థానికులు వాపోతున్నారు.



వరద వచ్చిన మరో ప్రాంతంలో దుస్థితి

బ్రిడ్జి నిర్మాణమెప్పుడు...?

ఆరో రోడ్డులోని బ్రిడ్జి నిర్మిస్తామని స్థానిక ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్లు చెప్పుకొచ్చారు. కానీ వరదలొచ్చి 18 నెలలు గడిచినా బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన పడలేదు. అది ఇంకా ప్రతిపాదన దశలోనే ఉంది. అక్కడ ఎత్తు సరిగా లేకపోవడంతో ఓ మోస్తారు వర్షం కురిసినా ఇళ్లల్లోకి వర్షపు, మురుగు నీరు వచ్చేస్తాయి. ఆ బ్రిడ్జి కింద నీరు వెళ్లే అవకాశం కూడా లేదు. నగరానికి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్ అడ్డంగా ఉంది. దీంతో అక్కడ బ్రిడ్జి నిర్మిస్తేనే శాశ్వత పరిష్కారం దక్కుతుందనడంలో సందేహం లేదు.



ఆరో రోడ్డులోని బ్రిడ్జికి అడ్డంగా ఉన్న తాగునీటి పైపులైన్



పూడిక తీయకపోవడంతో నడిమివంక ఇలా..



గడ్డితో పేరుకుపోయిన నడిమివంక



ఆగ్రహించిన అన్నదాత

● వన్-బి జారీలో జాప్యంపై ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

బత్తలపల్లి, మే 7: భూములకు 1బీ జారీలో జాప్యంపై అన్నదాతలు ఆగ్రహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం ఆందోళనకు దిగారు. సీపీఐ రైతు సంఘం నాయకుడు కాటమయ్య మాట్లాడుతూ.. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి యంత్రాంగం రీసర్వే ఇష్టారాజ్యంగా చేసిందని మండిపడ్డారు. ఫలితంగా రైతులు తమ భూములను కోల్పోవాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లోపభూయిష్టంగా ఉన్న రీసర్వేతో సంబంధంలేకుండా 1బీలు తొందరగా మంజూరు చేయాలని అయన డిమాండ్ చేశారు. పంట రుణాల రెన్యూవల్‌కు గడువు వచ్చిందనీ, ఇటువంటి పరిస్థితిలో 1బీ జారీ చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. వెంటనే 1బీ జారీ చేసి, రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు అక్కడికి చేరుకుని, ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ధర్నాలు చేయడానికి వీలులేదనీ, తహసీల్దార్ ఎన్నికల విధుల్లో ఉన్నారన్నారు. ఎన్నికల తరువాత తహసీల్దార్‌ను కలిసి, సమస్య పరిష్కరించుకోవాలని చెప్పడంతో రైతులు వెనుదిరిగారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 7: ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే గిరిజన విద్యార్థులు 2024-25 విద్యాసంవత్సరానికి జాతీయ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు తెలిపారు. మాస్టర్స్ లెవల్, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ పరిశోధన ప్రోగ్రాం కోర్సులు చేయబోయే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకం కింద 20 మంది గిరిజన విద్యార్థులకు జాతీయ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందజేస్తారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు http://overseas.tribal.gov.in/ వెబ్‌సైట్‌ను సందర్శించి, అర్హతలు, సూచనలు తెలుసుకొని ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఇంతియాజ్ అహ్మద్

నల్లచెరువు, మే 7: బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నల్లచెరువుకు చెందిన ఇంతియాజ్ అహ్మద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులను ధర్మవరంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్ శేఖర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన పార్టీ పెద్దలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రామ్మోహన్

నంబులపూలకుంట: బీజేపీ మండల అధ్యక్షుడిగా కశెట్టి రామ్మోహన్ నియమితులయ్యారు. ధర్మవరం పట్టణంలో మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు శేఖర్‌స్వామి తనను ఈ మేరకు ఎంపిక చేసినట్లు రామ్మోహన్ తెలిపారు. గతంలోనూ తాను పార్టీ మండలాధ్యక్షుడిగా పనిచేశానని, పార్టీకి చేసిన సేవల్ని గుర్తించి మరోసారి ఎంపిక చేశారని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన పార్టీ రాష్ట్ర పెద్దలకు, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గొడవలకు పాల్పడరాదు

నంబులపూలకుంట, మే 7: ఎన్నికల సమయంలో మండలంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీధర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆటోకు మైక్‌ని అమర్చి గ్రామ గ్రామానా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం మండలకేంద్రంతో పాటు, పెడబల్లి, కొత్తపల్లి గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల వేళ గొడవలకు పాల్పడరాదన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. గొడవలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పని హెచ్చరించారు.

నేడు పల్లె సింధూర ఎన్నికల ప్రచారం

నల్లమాడ, మే 7: మండలంలోని బాసంవారిపల్లి, కొత్తపల్లి, చెరువువాండ్లపల్లి, కుటాలపల్లి గ్రామాల్లో కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి బుధవారం ఉదయం 8గంటలకు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అలాగే సాయంత్రం 4గంటలకు మండలకేంద్రంలో పల్లె సింధూరతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి రోడ్ షో నిర్వహించనున్నట్లు చెప్పారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొనాలని కోరారు.

ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్



వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్

కొత్తచెరువు, మే 7: మండలంలో వలంటీర్లు, ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్‌లు తరచూ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మండలకేంద్రంలో వైసీపీ నాయకులు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అబ్బుబాకర్, మద్యం దుకాణంలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న భరాకత్ పాల్గొన్నారు. వైసీపీ ప్రచార కరపత్రాలను పంపిణీ చేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ ఇంటింటా తిరిగారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని ఎన్నికలసంఘం ఆదేశాలు జారీ చేసినా.. వాటిని బేఖాతరు చేస్తూ ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇవన్నీ చూసిన అధికారులు ఏమి పట్టనట్టు వ్యవహరించడం పట్ల ఆంతర్యమేమిటోనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాదికారులు స్పందించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రంలో కాంట్రాక్టు ఉద్యోగి

కదిరి, మే 7: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరుగుతున్న కదిరి పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాల పోలింగ్ కేంద్రంలో మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి అబీబుల్లా వైసీపీ నాయకులతో కలిసి మంగళవారం వచ్చారు. వైసీపీ నాయకుడు సాధిక్ బాషాతో కలిసి ఆ ఉద్యోగి పోలింగ్ కేంద్రమంతా కలియతిరిగారు. మధ్యాహ్నం వరకు వైసీపీ నాయకులతోనే ఉండిపోయారు. మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి అయి ఉండి వైసీపీ నాయకులతో కలిసి పోలింగ్ కేంద్రంలోకి వచ్చారని పలువురు ఆర్వో, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు.

చంద్రబాబుతోనే యువతకు ఉపాధి: కందికుంట



దండువారిపల్లిలో ప్రచారం చేస్తున్న కందికుంట వెంకట ప్రసాద్



కౌన్సిలర్ రాజశేఖరాచారిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కందికుంట

తనకల్లు, మే 7: చంద్రబాబుతోనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని ముండ్లవారిపల్లి పంచాయతీలో దండువారిపల్లి, బీమ్లానాయక్ తండా, బూలేనాయక్‌తండా, పెండ్లిగుండుతండా, నాయన చెరువుపల్లి గ్రామాలు, మల్లిరెడ్డిపల్లి పంచాయతీలో పెద్దపల్లి, వడ్డుమరవపల్లి, నక్కరాళ్లతండా, మల్లిరెడ్డిపల్లి గ్రామాలు, కోటపల్లి పంచాయతీలో కోటపల్లి, చిన్నపల్లి, నడిమితండా, దేవలంతండా, ఏనుగుగుండుతండా గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, నాయకులు పూలవర్షం కురిపిస్తూ, గజమాలలతో సత్కరిస్తూ ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రతిఒక్కరినీ పలకరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే తనను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. అదేవిధంగా చంద్రబాబు సీఎం అయితే పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. అలాగే తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేస్తారని అన్నారు. కూటమి విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ తొట్టిరెడ్డిశేఖర్‌రెడ్డి, కూటమి నాయకులు దేశాయి విదురశేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, శంకర్‌నాయుడు, రాజారెడ్డి, ఆనంద్‌రెడ్డి, రమణారెడ్డి ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి కౌన్సిలర్ చేరిక

కదిరి: టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. పట్టణంలో మంగళవారం వైసీపీకి చెందిన మరో కౌన్సిలర్ రాజశేఖరాచారి ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరారు. గతంలో అయన టీడీపీలో సుదీర్ఘకాలం పాటు కౌన్సిలర్‌గా పని చేశారు. గత ఎన్నికల ముందు టీడీపీని వదలి వైసీపీలోకి చేరారు. ఇపుడు తిరిగి సొంత గూటికి చేరారు. ఈ సందర్భంగా ఎంజీరోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో ఆ పార్టీలోకి చేరారు. ఆయనకు కందికుంట కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రస్తుతం రాజశేఖరాచారి 19వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. కందికుంట మాట్లాడుతూ బడుగుల పార్టీ టీడీపీ అన్నారు. వైసీపీ ఒక్కచాన్స్ పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. అందుకే గతంలో టీడీపీని వీడి వైసీపీలో చేరినవారందరూ ఇప్పుడు తిరిగి సొంత గూటికి చేరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి కూడా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత 20యేళ్లుగా కందికుంట ప్రసాద్ కదిరి ప్రజలతోనే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నారని అన్నారు. అలాంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా చేసుకోవడం అందరి బాధ్యత అన్నారు. కూటమి నాయకులు బాహుద్దీన్, కిష్టప్ప, వీఆర్సీ బాబు, డంకనాచారి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు అంతం పలకాలి: మాజీమంత్రి పల్లె



ఓడీసీలో రోడ్‌షో చేస్తున్న మాజీ మంత్రి పల్లె. ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర



పుట్టపర్తిలో ఎన్నికల ప్రచారంలో పల్లె కిశోర్ రెడ్డి

ఓబుళదేవరచెరువు, మే 7: రాష్ట్రంలో అవినీతి వైసీపీ పాలనకు అంతం పలకాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డితో కలిసి రోడ్డుషో చేపట్టారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. టీడీపీ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆకుతోటపల్లి వరకు కొనసాగింది. రోడ్డుషోలో పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాల వారికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అవినీతి, అరాచక పాలన సాగిందన్నారు. అలాంటి పాలన మనకు అవసరమా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో వైసీపీ పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా పార్థసారధిని గెలిపించాలని కోరారు. పల్లె సింధూర మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తర్వాత వారు ఆకుతోటపల్లి, వేమారెడ్డిపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇందులో జనసేన రాష్ట్ర కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సింధూరను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్, కూటమి నాయకులు జయచంద్ర, పిట్టా ఓబులరెడ్డి, ఎద్దుల ప్రమోద్‌కుమార్‌రెడ్డి, పిట్టా ప్రభాకర్‌రెడ్డి, తుమ్మల మహబూబ్ బాషా, జెరిపిటిఅంజనప్ప, పీట్ల సుధాకర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లె కిశోర్ రెడ్డి ప్రచారం

పుట్టపర్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జెండావేపమానువీధి, పెద్దబజారు, గోవిందపేట, ఎస్బీఐ రోడ్డు ప్రాంతాల్లో టీడీపీ యువనాయకుడు పల్లె వెంకట కృష్ణకిశోర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డిని, ఎంపీగా బీకే పార్థసారధిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి అధికారంలోకి వస్తే చేపట్ట అభివృద్ధి పనులను, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బెస్తచలపతి, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండలంలోని తలమర్లలో పల్లె వెంకటకృష్ణకిశోర్ రెడ్డి, కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. గ్రామంలోకి రాగానే వారికి గ్రామస్థులు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. తర్వాత రోడ్ షో చేశారు. పల్లె కిశోర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని మండిపడ్డారు. రైతులకు అందాల్సిన డ్రిప్, స్ప్రింక్లర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లను, హార్టికల్చర్ ద్వారా అందే రాయితీలను సైతం అందించకుండా రైతులను నిలువునా మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు ఎన్నికలకు ముందు డీఎస్సీని ప్రకటించి నిర్వహించకుండా కాలయాపన చేసి మోసం చేశారన్నారు. ఉద్యోగులకు టీడీపీ హయాంలో 1వ తేదీనే జీతాలు వచ్చేవని, జగన్ పాలనలో 12వతేదీ దాటినా రావడం లేదని అన్నారు. ఇలాంటి వ్యక్తికి మరలా అధికారం ఇస్తే అంతేసంగతులన్నారు. ప్రజలు ఆలోచించి కూటమిని గెలిపించాలన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధని గెలిపించాలని కోరారు. బీకే మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఆయన సీఎం అయితేనే సంక్షేమ పథకాలు ప్రలందరికీ అందుతాయని అన్నారు. కూటమిని గెలిపించాలని ప్రజల్ని అభ్యర్థించారు.

టీడీపీలోకి పలువురి చేరిక

కొత్తచెరువు: మండల కేంద్రానికి చెందిన పలు వడ్డెర కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సమక్షంలో చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు టీడీపీ కొత్తచెరువు టౌన్ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు , సాలక్కగారి శ్రీనివాసులు, నరేంద్ర, వాల్మీకి శ్రీనివాసులు, కొడపగానిపల్లి శివ, నల్లమాడ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే నా ధ్యేయం: సత్యకుమార్



బత్తలపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న సత్యకుమార్

బత్తలపల్లి/ తాడిమర్రి, మే 7: గ్రామాల అభివృద్ధే తన ధ్యేయమని , అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని గ్రామాలన్నంటినీ అభివృద్ధి చేస్తానని కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంతో పాటు పోట్లమర్రి, వేల్పుమడుగు గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగి ఎమ్మెల్యే అభ్యర్థికి కమలం గుర్తుకు, ఎంపీ అభ్యర్థికి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజల్ని కోరారు. అధికారంలోకి రాగానే గ్రామాల్లో సమస్యల్ని పరిష్కరించి అభివృద్ధికి పాటు పడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగోనుగుంట్లవిజయ్‌కుమార్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. ప్రచారంలో ధర్మవరం పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు మిరియాల అంజి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో బీజేపీలోకి చేరారు. ఇక తాడిమర్రి మండలం మరువపల్లి, తాడిమర్రిగ్రామాల్లో సత్యకుమార్ ఇంటింటాప్రచారం చేపట్టారు. మరువపల్లి గ్రామంలో చింతల వన్నూర్‌రెడ్డి ఆధ్వర్యంలో వందకుటుంబాల వారు వైసీపీని వీడి బీజేపీలోకి చేరారు. కిశోర్, శంకర్‌రెడ్డి తదితరులు తమ అనుచరులతో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి సత్యకుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తాడిమర్రిలో రోడ్‌షో చేపట్టారు. కూటమిని గెలిపించాలని ప్రజల్ని అభ్యర్థించారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

సత్యకుమార్ సతీమణి ప్రచారం

ముదిగుబ్బ/ పుట్టపర్తి: మండల కేంద్రంలోని పాతవూరిలో సత్యకుమార్ సతీమణి త్రివేణి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి కమలం గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా సత్యకుమార్‌ను, సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. మలకవేముల క్రాస్‌లో స్థానిక ప్రజలు, మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. త్రివేణి పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని దర్శించి పూజలు చేశారు. స్థానిక కూటమి నాయకులు శాలువాతో సత్కరించి ,బాబా చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఆమె సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు,

సినీ నటుడు సాయికుమార్ ప్రచారం



నిమ్మలకుంటలో పర్యటిస్తున్న సాయికుమార్

ధర్మవరం: సత్య కుమార్‌కు మద్దతుగా నిమ్మలకుంట, పోతుకుంట గ్రామాల్లో సినీనటుడు సాయికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటు వేసి సత్యకుమార్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. అలాగే సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీకే పార్థసాధిని గెలిపించాలన్నారు. అనంతరం సాయంత్రం 5గంటలకు ధర్మవరం పట్టణంలో చక్రవర్తి థియేటర్ నుంచి కళాజ్యోతి సర్కిల్‌వరకు రోడ్‌షో చేపట్టారు. సాయికుమార్‌ను చూడటానికి ప్రజలు ఎగబడ్డారు. ఆయన అందరినీ ఆప్యాయంగా పలకరించారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో ఉద్యోగుల అవస్థలు

- ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద సదుపాయాలు కరువు
- నీడ లేక ఎండవేడిమికి విలవిల్లాడిన ఉద్యోగులు
- చెట్ల నీడకు పరుగులు
- కేంద్రాల సమీపంలో ఎమ్మెల్యే పీఏ ఉద్యోగులతో మాటామంతీ
- పట్టించుకోని పోలీసులు, అధికారులు



పోలింగ్ కేంద్రం వద్ద నీడ లేక పడుతున్న మహిళా ఉద్యోగులు

ధర్మవరంరూరల్, మే7: ధర్మవరం పట్టణంలో పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్‌కు ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద కనీస సదుపాయాలు కరువయ్యాయి. ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులకు కనీసం నిల్చునేందుకు నీడ కూడా లేదు. దీంతో ఎండవేడిమికి అల్లాడిపోయారు. షామియానాలు, బారికేడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7గంటలకు పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ప్రారంభమైంది. తొలుత ఉద్యోగులు పెద్దగా కనిపించలేదు. 10గంటల నుంచి భారీగా తరలివచ్చారు. ఒక్కసారిగా అంగన్‌వాడీ ఉద్యోగినులు, ఐకేపీ, సచివాలయ ఉద్యోగులు, ఇతర శాఖల ఉద్యోగులు ఓటింగ్ కోసం వచ్చారు. అక్కడికి రాగానే ముందుగా డిక్లరేషన్ పేపర్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే ఉద్యోగులు రాసుకునేందుకు కూడా బెంచీలు ఏర్పాటు చేయకపోవడంతో నేలపై కూర్చుని రాశారు. ఈ ఓటింగ్‌లో ధర్మవరం నియోజకవర్గంతో పాటు రాప్తాడు, హిందూపురం, మడకశిర, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ నియోజకవర్గాలకు సంబంధించి ఉద్యోగులకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా పక్కజిల్లాల ఉద్యోగులకు కూడా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే వాటి వద్ద నిలువ నీడ లేకపోయింది. ఉద్యోగులు ఎండవేడిమికి తాళలేక చెట్ల కింద నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళ ఉద్యోగులు పేపర్లతో గాలి కోసం విసురుకుంటూ క్యూలైన్‌లో నిలబడ్డారు. ఈ కేంద్రాలను ఆర్‌ఓ వెంకటశివరామిరెడ్డి పరిశీలించారు. ఇప్పటికి పోస్టల్‌బ్యాలెట్‌లో 1333మంది ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించిన ఉద్యోగులు 1092 మంది, వేర్వేరు జిల్లాలకు చెంది ఎన్నికల విధులకు వచ్చిన అధికారులు 185మంది, జిల్లాలో వేర్వేరు నియోజకవర్గాలకు చెందిన 60 మంది ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు.



నేలమీద కూర్చుని డిక్లరేషన్ రాస్తున్న ఉద్యోగిని

ఉద్యోగులతో ఎమ్మెల్యే పీఏ మాటమంతీ..

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పీఏ గుర్రం శ్రీనివాసరెడ్డి జనరల్ ఏజెంట్‌గా కేంద్రాల వద్దకు వచ్చారు. ఉద్యోగుల వద్దకు వెళ్లి మాటలు కలిపారు. గేటు వద్ద కూర్చొని ఓటింగ్‌కు వెళ్లే ఉద్యోగులతో మాట్లాడడం మొదలుపెట్టారు. ఈ సందర్భంలో అక్కడికి వచ్చిన బీజేపీ ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏజెంట్‌గా వచ్చినప్పుడు పోలింగ్ సరళిని పరిశీలించాలని గానీ.. ఓటింగ్‌కు వచ్చే ఉద్యోగులతో మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు , అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అదేవిధంగా పలువురు అంగన్‌వాడీ వర్కర్ల భర్తలు కేంద్రాల సమీపం వద్దకు వచ్చారు. వారు సెల్‌ఫోన్‌లకు ఎమ్మెల్యే స్టిక్కర్లను అతికించుకుని ఓటింగ్‌కు వెళ్లే ఉద్యోగులతో మాట్లాడుతుండటంతో బీజేపీ నాయకులు అభ్యంతరం చెప్పారు. దీంతో వారిని డీఎస్పీ శ్రీనివాసులు అక్కడి నుంచి బయటకు పంపించారు.

ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా చూడండి

● పోలీసు పరిశీలకుడికి టీడీపీ జిల్లా అధ్యక్షుడి వినతి



ఎన్నికల పోలీసు పరిశీలకుడికి వినతి పత్రం ఇస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

పుట్టపర్తి రూరల్, మే7: జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప.. జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకుడు ఇమ్మానెల్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన ఎన్నికల పోలీసు పరిశీలకుడిని కలిసి విన్నవించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ అధికార వైసీపీకి వత్తాసు పలుకుతున్నారనీ, చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడి వెంట కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఉన్నారు.

1228 మంది పోస్టల్‌బ్యాలెట్ వినియోగం



కదిరిలో ఓటింగ్‌కు బారులు తీరిన ఉద్యోగులు

పుట్టపర్తి మే 7: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు మంగళవారం 1228 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నట్లు ఆర్వో భాగ్యరేఖ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఆర్వీజే జిల్లాపరిషత్‌ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. అందులో జిల్లాలోని ఉద్యోగులతో పాటు జిల్లాలో పనిచేస్తున్న ఇతర జిల్లాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. బుధవారం సైతం సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అవకాశాన్ని కల్పించామంటూ ఆర్వో పేర్కొన్నారు.

1,454 మంది ..

కదిరి: కదిరి పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలలో మంగళవారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 1454 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1873 మందికి గాను 1454 మంది ఓటు వేసినట్లు ఏఆర్‌ఓ ముకుంద తెలిపారు. ఎప్పుడూ లేనంతగా ఈసారి ఉద్యోగులు ఓటు వేయడానికి బారులు తీరారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కదిరి నియోజకవర్గంలోని ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళ ఉద్యోగులు అధిక శాతం ఓటింగ్‌లో పాల్గొన్నారు. దాదాపు 80శాతానికి పైగా ఓటింగ్ జరిగింది. పోలింగ్‌ను ఆర్వో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత పర్యవేక్షించారు.

443 మంది పోలీసు సిబ్బంది..



పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న ఏఎస్పీ విష్ణు

పుట్టపర్తిరూరల్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే జిల్లా పోలీసులు మొదటిరోజు మంగళవారం 443 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు ఆర్వో భాగ్యరేఖ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని జిల్లాపోలీసు కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 1211 మంది పోలీసు సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉండగా 443 మంది పోలీసులు , హోంగార్డులు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో తెలిపారు. పోస్టల్‌బ్యాలెట్ సౌకర్యం నేడు, రేపు (8, 9తేదీలలో కూడా కొనసాగనుందని చెప్పారు.

బలవంతంగా ఇళ్లకు సిద్ధం స్టిక్కర్లు

చర్యలు తీసుకోవాలని ఆర్‌ఓ అభిషేక్ కుమార్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు



ఆర్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, మే 7 : లేపాక్షి మండలం శిరివరం గ్రామంలో రెండు మూడు రోజులుగా కొంతమంది అధికార పార్టీ నాయకులు ఇళ్ల వద్దకు వెళ్లి బలవంతంగా సిద్ధం స్టిక్కర్లు అతికిస్తు న్నారని, అలాంటివారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చీఫ్ ఎలెక్షన్ ఏజెంట్ జేఈ అనిల్‌కుమార్ మంగళవారం పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్ కేంద్రంవద్ద హిందూపురం ఎన్నికల రిటర్నిం గ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కలిశారు. శిరివరంలో కొందరు వైసీపీ నాయకులు బలవంతంగా ఇళ్లకు సిద్ధం స్టిక్కర్లు అతికిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. వాటిని తొల గించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. ఇళ్లకు స్టిక్కర్లు అతికించడంపై లేపాక్షి మండల ఎన్‌సీసీ టీమ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



అనిల్‌కుమార్ (ఫైల్)

పెనుకొండ రూరల్, మే 7 : సొంత ఇల్లులేదనే మనస్తాపంతో అనిల్‌కుమార్ (35) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసు కున్నట్లు రైల్వే ఎస్‌ఐ బా లాజీ నాయక్ తెలిపారు. మండలపరిధిలోని వెంకట రెడ్డిపల్లికి చెందిన బలిజ వెం కటప్పకుమారుడు అనిల్ కుమార్ మినరల్ వాటర్ తరలించే వాహన డ్రైవర్‌గా ప నిచేస్తూ జీవనం సాగించేవాడు. అతడు రెండేళ్ల కిందట శాలిని అనే యువతిని వివాహం చేసుకున్నాడు. పూరి గుడిసెలో నివసిస్తున్నాడు. సొంత ఇల్లులేదని మనస్తా పానికి గురై కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అతడు మంగళవారం మండలంలోని రాం పురం సమీపంలో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నా డు. కీమెన్ అందించిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొం డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య శాలిని, ఎనిమిది నెలల కుమార్తె ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి కాలేదని మరో యువకుడు..

లేపాక్షి, మే 7 : వయసు పెరుగుతున్నా పెళ్లికాలేదనే మనస్తాపంతో మండలపరిధిలోని పులమతి గ్రామంలో ఓ యువకుడు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. పులమతి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ(37)కు ఎన్ని సంబంధాలు చూసినా పెళ్లి కుదరలేదు. వయసు పెరుగుతున్నా పెళ్లికాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. లక్ష్మీనారాయణ తండ్రి గంగాధరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉరివేసుకుని మహిళ...

లేపాక్షి, మే 7: మండలపరిధిలోని కంచిసముద్రం గ్రామంలో మంగళవారం ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కంచిస ముద్రం గ్రామానికి చెందిన ఆదినారాయణమ్మ (42) తన ఇంటి పక్కనున్న పాడుబడిన పూరిగుడిసెలో ఉరి వేసుకుని మృతిచెందింది. ఇది గుర్తించిన గ్రామస్థులు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త, కు మారుడు, కుమార్తె ఉన్నారు. అయితే గ్రామస్థులు ఆమె మృతిపట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

యంత్రంలో ఇరుక్కుని తెగిన మహిళ చేయి

గోరంట్ల, మే 7: పశుగ్రాసం కత్తరించే యంత్రంలో చిక్కుకుని వృద్ధ మహిళ రైతు తిప్పమ్మ కుడిచేయి తెగిపోయింది. కర్ణాటక సరిహద్దులోని కొత్తకోటకు చెం దిన బాబయ్య భార్య తిప్పమ్మ సీమ గడ్డిని చాప్ కర్టర్ ద్వారా మంగళవారం నూర్పిడ చేస్తుండగా ప్రమాదం జరిగింది. పాడి పశువులకోసం గడ్డిని సిద్ధం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కుడిచేయి యంత్రంలో ఇరుక్కుని మణికట్టువద్ద పూర్తిగా తెగి చర్మానికి వేలాడు తోంది. ఆమెను గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ వినోద్‌కుమార్ ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం బెంగుళూరు తరలించారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

గోరంట్ల, మే 7: మండలంలోని సింగిరెడ్డిపల్లి వద్ద మంగళవారం ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటో బోల్తా పడి డ్రైవర్ ముబాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. బూదిలి గ్రామానికి చెందిన ముబాకర్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు ప్రయాణికులతో వెళ్తుండగా ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ముబాకర్ తలకు బలమైన గాయం తగిలి చెవినుంచి రక్తం కారుతోంది. అతడిని గోరంట్ల ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ వినోద్‌కుమార్ ప్రథమచికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో హిందూపురం తరలించారు. మిగిలి న ఇద్దరు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

గోరంట్ల, మే 7: మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారిపై కారును బైక్ ఢీకొన్న ప్రమాదంలో శ్రీరామనాయక్, మరో వ్యక్తి మంగళవారం తీవ్రంగా గాయపడ్డారు. పుట్టపర్తి మండలంలోని పెడబల్లి తండాకు చెందిన ఓ వ్యక్తి పాలసముద్రం బ్యాంక్‌లో పనిచేస్తున్న బంధువును పరామర్శించడానికి వచ్చాడు. తిరిగి వెళ్తున్నప్పుడు పాలసముద్రం నుంచి స్కూటీపై మిషన్ తండాకు చెందిన గొర్రెల కాపరి శ్రీరామనాయక్‌ను ఎక్కించుకున్నాడు. పొత్తనపల్లి తం డాకు వెళ్తుండగా అనంతపురం నుంచి బెంగుళూరువైపు వెళ్తున్న కారు ఢీకొంది. శ్రీరామునాయక్‌కు కాలు విరగా, అంబులెన్స్‌లో హిందూపురం తరలించారు. పెడబల్లికి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. అతడి పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో అంబులెన్స్‌లో అనంతపురం తరలించారు.

వైసీపీ అరాచకాలను అరికడదాం

ఎన్నికల ప్రచారంలో నందమూరి బాలకృష్ణ



పూలకుంటలో ప్రచారానికి హాజరైన జనం



లింగాయత్‌ల సమావేశంలో మాట్లాడుతున్న వసుంధరా దేవి

హిందూపురం, మే 7: రాష్ట్రంలో ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు టీడీపీకి ఓటు వేసి వైసీపీ అరాచకాలను అరికడదామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆయన మంగళ వారం పట్టణంతో పాటు రూరల్ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ... ఐదేళ్ల వైసీపీ పాల నంతా అరాచకాలు, అఘాయిత్యాలతో సాగిందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా వచ్చింద న్నారు. ఉమ్మడి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలు ప్ర జలకు ఎంతగానో అండగా నిలుస్తాయన్నారు. హిందూ పురం మరింత అభివృద్ధి జరగాలంటే టీడీపీ అధికా రంలోకి రావాల న్నారు. తాను మూ డో సారి బరిలో ఉ న్నానని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వ చ్చే ఐదేళ్లలో కేంద్రం సాయంతో మోడల్ నియోజకవర్గం గా తీర్చుదిద్దుతానన్నారు. నందమూరి బాలకృష్ణ సోదరుడు రామకృష్ణ పాల్గొని ఓట్లను అభ్యర్థించారు.

లింగాయత్‌లతో వసుంధరాదేవి సమావేశం

పట్టణంలోని కనకదాస కల్యాణమండపంలో మంగళ వారం వీరశైవ (లింగాయత్) కులస్థులు, మహిళలతో నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరా దేవి సమావేశం నిర్వహించారు. టీడీపీ హయాంలో లింగా యత్‌లకు పెద్ద పీట వేశామన్నారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటారన్నారు. లింగాయత్ కుల సంఘం నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నందమూరి రామకృష్ణ ప్రచారం

చిలమత్తూరు/ హిందూపురం: నందమూరి బాలకృష్ణను మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించు కుందామని బాలకృష్ణ సోదరుడు నందమూరి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం ఆయన బాల య్యకు మద్దతుగా ఎన్నికల ప్రచారానికి హైదరాబాదు నుంచి హిందూపురం వచ్చారు. కొడికొండ చెక్‌పోస్టులో టీడీపీ స్థానిక నాయకులు రంగారెడ్డి, చంద్రశేఖర్, సో మశేఖర్, బేకరీ గంగాధర్, నందీశప్ప, శివ, ప్రవీణ్ కు మార్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనం త రం ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు హిందూపురం తరలివెళ్లారు. పట్టణంలోని బోయపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, ఎన్‌టీకే ఫ్యాన్స్ నంబూరు సతీష్, హెచ్‌ఎన్ రాము, సురేష్ తదితరలు పాల్గొన్నారు.



బోయపేటలో ప్రచారం చేస్తున్న రామకృష్ణ

ఓటమిభయంతోనే వైసీపీ అరాచకాలు

ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి సవిత



వెంకటగిరి పాళ్యంలో హారతి పడుతున్న మహిళలు



భారీ జనసందోహం నడుమ సవిత ఎన్నికల ప్రచారం

పెనుకొండ, మే 7: ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని, పెను కొండలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సందర్భంగా వారు అనుసరించిన విధానమే అందుకు నిదర్శనమని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విమర్శించారు. ఆమె మంగళవారం మండలంలోని గుట్టూరు, వెంకటగిరిపా ళ్యంలో భారీ జనసందోహం మధ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు అడుగడుగునా సవితకు పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడు తూ.. వైసీపీ ఐదేళ్లపాలనలో గ్రామాల్లో ఏ ఒక్క అభి వృద్ధి జరగలేదన్నారు. కియ పరిశ్రమ రాకతో ఇక్కడి గ్రామాల్లో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభించా యన్నారు. ఇంకా అలాంటి పరిశ్రమలు తెప్పించడం చంద్రబాబుతో సాధ్యమన్నారు. రాష్ట్రం బాగు కోసం చం ద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ టీసీ నారాయణస్వామి, మాజీ ఎంపీపీ కేశవయ్య, గు ట్టూరు చిన్నవెంకటరాముడు, మండల కన్వీనర్ సిద్ద య్య, గుట్టూరు సూరి, శ్రీరాములు యాదవ్, నాయకులు రఘువీరచౌదరి, వీజీపాళ్యం శీన, కోనాపురం రామలింగ, పోతిరెడ్డి, బాబుల్‌రెడ్డి, గొందిపల్లి సూరి, మల్లికార్జున, బోయ నాగరాజు, సుబ్బరాయుడు, తుపాకుల రవి, వడ్డి వెంకటేశ్, హనుమంతు, రమేష్‌నాయుడు, తెలుగు యువత మల్లి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళలకు ఉపాధి, భద్రత

గోరంట్ల: యువతకు ఉపాధి అవకాశాలు, లభించా లన్నా, మహిళలతకు భద్ర కావాలన్నా టీడీపీ తోనే సాధ్యమని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె మంగళవారం గోరంట్ల మండలం లోని బూదిలి గ్రామం వద్ద శ్యాండిల్స్ పరిశ్రమలో పని చేస్తున్న యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ.. అభివృద్ధికి చిరు నామా కియ పరిశ్రమ అన్నారు. అవినీతికి కేరాఫ్ లేపాక్షి హబ్ నాలెడ్జ్ భూములన్నారు. నిరుద్యోగ నిర్మూ లన, మహిళ సాధికారిత, భద్రత చంద్రబాబు పాలన లోనే లభిస్తాయన్నారు. సీఎం జగన్ పాలనలో లేపాక్షి నాలెడ్జ్ హబ్ కోసం సే కరించిన భూములు ఇటు రైతులకు, అటు పరిశ్రమలకు కాకుండా పోయిన విషయాన్ని వివరించారు. టీడీపీ సూపర్ సిక్స్‌పథకాల్లో మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. మహి ళలకు ప్రతినెల రూ. 1500, యేడాదికి మూడు ఉచిత సిలిండర్లు, ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం లభి స్తుందని వివరించారు. రాష్ట్రానికి విరివిగా పరిశ్ర మలు రావాలన్నా, యువత బాగుపడాలన్నా, రాష్ట్ర భవిష్యత్ కోసం సైకిల్ గుర్తుకు ఓటువేయాలని కోరారు. ఈ ప్రాంతం మరో నాలుగు తరాలు గుర్తుండేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పార్థసార థిని అత్యధిక మెజార్టీతో గెలి పించాలని కోరారు. ఈ సందర్భంగా గోరంట్లకు చెందిన వైసీపీ నాయకుడు స్థానిక హోటల్ యజమాని ఆదినారాయణ ఆధ్వ ర్యంలో 15కుటుంబాలు టీడీపీలో చేరాయి. సవిత వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్ర మంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు న్నారు.



పరిశ్రమలో మాట్లాడుతున్న సవిత



గోరంట్లలో టీడీపీలోకి చేరిన వారికి కండువాలు వేస్తున్న సవిత

వైసీపీ అరాచక పాలనను తరిమికొడదాం: ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, మే 7: వైసీపీ అరాచక పాలనను తరిమి కొడదామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో జనసేన, బీజేపీ, టీడీపీ అందరి సహకారంతో మంచి మెజారిటీతో విజయం సాధిం చడం ఖాయం అన్నారు. ఆయన మంగళవారం బాలాజీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో చిరంజీవి రాష్ట్ర ఫ్యాన్స్ అధ్యక్షుడు భవాని రవిశంకర్, సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామితో కలసి టీడీపీ, జనసేన నాయకులు, కార్యక ర్తల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి తనను ఓట్లు వేసి గెలిపిం చాలని కోరారు. ఈ సందర్భంగా మడకశిర మండలంలోని సీ కొడిగేపల్లి ఉపసర్పంచ్ తిమ్మన్న, గ్రామానికి చెందిన జయరామప్ప వారి అనుచరులతో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలాగే కొత్తలం గ్రామానికి చెందిన ఐదు కుటుం బాలు, గుడిబండ మండలం ఎస్ రాయాపురానికి చెందిన 10 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారికి ఎంఎస్‌రాజు, గుండుమల తిప్పేస్వామిలి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

గుడిబండ: రాష్ట్రంలో ఈనెల 13న జరగబోయే సార్వత్రి ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్‌రాజు, ఎంపీ అభ్యర్థి పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపిం చాలని ఎంఎస్ రాజు సతీమణి ఉమాదేవి ప్రజలను కోరా రు. ఆమె మండలంలోని ఎస్ రాయాపురంలో ఇంటింటి ప్ర చారం నిర్వహించారు. నాయకులు నాగేంద్రప్ప తది తరు లు పాల్గొన్నారు. మండలంలోని ముదుకూరు, పం చాయతీలో క్లస్టర్ ఇన్‌చార్జ్ లక్ష్మీనరసప్ప, కార్యదర్శి ప్ర కాశ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నా యకు లు షబ్బీర్, వెంకటేశ్, సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 7: ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే గిరి జన విద్యార్థులు 2024-25 విద్యాసంవత్స రానికి జాతీయ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజ నేయులు తెలిపారు. మాస్టర్స్ లెవల్, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ పరిశోధన ప్రోగ్రాం కోర్సులు చేయబోయే విద్యా ర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవా లని ఆయన సూచించారు. ఈ పథకం కింద 20 మంది గిరిజన విద్యార్థులకు జాతీయ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందజే స్తారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు http://overseas.tribal.gov.in/ వెబ్‌సైట్‌ను సందర్శించి, అర్హతలు, సూచనలు తెలుసుకొని ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొ న్నారు.

ఆలస్యంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

- ఉదయం 10 గంటలైనా సౌకర్యాలు కల్పించని అధికారులు
- ఆర్‌ఓకు టీడీపీ నాయకుల ఫిర్యాదు

హిందూపురం, మే 7: స్థానిక కొట్నూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహించారు. మొదటి రోజు ఉదయం 10 గంటలకే ప్రారంభం కావాల్సిన పోలింగ్ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. పోలింగ్ ఉందని తెలిసినా పది గంటల వరకు పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. మరోపక్క ఉద్యోగులు తమ ఓటు హక్కుకు వినియోగించుకునేందుకు ఉదయం 9 గంటలకే క్యూలైన్లో నిలబడ్డారు. వచ్చిన వారికి కనీసం పోలింగ్ కేంద్రం వద్ద కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదు. దీని వలన మహిళా ఓటర్లు సుమారు మూడు గంటల పాటు చెట్ల నీడనే నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే 11 గంటలకు పోలింగ్ ప్రారంభమైందది. కొంత మంది ఓటర్లకు అవగాహన లేకపోవడంతో అభ్యర్థి గుర్తు ఉన్నచోట టిక్ పెట్టాల్సింది పోయి కొంత మంది సంతకం పెట్టారు. మరికొంత మంది ఇద్దరికీ టిక్కులు పెట్టారు. దీనిపై కొంత మంది ఓటర్లు చర్చించుకోవడం కనిపించింది. కానీ పోలింగ్ కేంద్రంలో ఉన్న అధికారులు ఓటు ఎలా వినియోగించుకోవాలో తెలుపక పోవడం విశేషం. ఈ విషయాన్ని టీడీపీ ఎలెక్షన్ చీఫ్ ఏజెంట్ అనిల్ కుమార్ అక్కడే ఉన్న ఆర్‌ఓ అభిషేక్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆర్‌ఓ ఓటు వేసే విధానాన్ని ఓటర్లకు మైక్ ద్వారా వివరించారు. ఎలా వేస్తే ఓటు చెల్లుతుంది? లేకపోతే ఇన్‌వ్యాలీడ్ అవుతుందనే విషయాలను తెలియజేశారు.

తాగునీటికి ఇక్కట్లు: పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి వందలాది మంది వస్తారని తెలిసి కూడా పోలింగ్ కేంద్రం వద్ద తాగునీటి వసతి కల్పించలేదు. అసలే ఎండవేడిమి, ఉక్కుపోతతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. కానీ చిన్న క్యాన్లలో నీటిని పెట్టడంతో అవి సరిపోకపోవడంతో ఓటర్లు చాలా ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. దీంతో విషయం తెలుసు కున్న టీడీపీ నాయకులు తాగునీటి వసతి కల్పించారు.

పురంలో ఓటేసిన 802 మంది..

హిందూపురం అర్బన్: దేశంలో నాలుగో విడత కింద రాష్ట్రంలో ఈ నెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబం ధించి మంగళవారం హిందూపురం, పెనుకొండ, మడకశిరకు చెంది న ఓపీఓలు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. కాగా పోలింగ్ సమయంలో ఎండ వేడిమి తీవ్రంగా ఉండటంతో కొంత మంది బుధవారం వినియోగించుకుం దామని వెనుది రిగారు. పోస్టల్ ఓటుహక్కు వినియోగించుకు న్నందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తదితరులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా పోస్టల్ బ్యాలెట్ ఆలస్యం కావడంతో వేయడానికి వచ్చిన వారు అసహనం వ్యక్తం చేశారు. హిందూపురంలో 1986 మంది ఓపీఓ లు, జనరల్ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నా రు. అయితే హిందూపురం, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి ఉద్యోగులు ఉండగా మంగళవారం 802 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.



ఓటు వేసినట్లు సిరా గుర్తు చూపుతున్న ఉద్యోగులు





ఉదయం 9గంటలకే ఓటు వేయడానికి క్యూలో ఉన్న పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు

290 మంది హోం ఓటింగ్ : ఆర్‌ఓ

మడకశిర రూరల్, మే 7: నియోజకవర్గంలో 290 మంది హోం ఓటింగ్ సద్వినియోగం చేసుకున్నారని ఆర్‌ఓ గౌరిశంకర్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో 306 మంది హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం నిర్వహించిన హోం ఓటింగ్‌లో 85 ఎళ్ల పైబడిన వృద్ధులు 104 మంది, దివ్యాంగులు 186 మంది ఓటు హక్కును వినయోగిం చుకున్నట్లు తెలపారు. మిగిలిన 16 మందిలో కొంత మంది మరణించారు. మరి కొంత మంది వివిధ కారణలతో గ్రామాల్లో లేకపోవడంతో ఓటు వేయలేకపోయారని తెలిపారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

రొద్దం, మే 7 : మండల పరిధిలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మండల పరిధిలోని తురకలాపట్నం, ఆర్‌మరువపల్లి, రొద్దంలో మంగళ వారం ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథికి ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు సుబ్బరత్నమ్మ, నరసింహులు, బీకే సుధాకర్, తురకలాపట్నం గ్రామానికి చెందిన నాగేంద్ర, షణ్ముఖ, శ్రీనివాసులు, హరి, మాజీ డీలర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపు గోరంట్లలో రోడ్‌షో

గోరంట్ల, మే 7 : ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రమైన గోరంట్లలో గురువారం రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత మంగళవారం తెలిపారు. హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థ సారథి పాల్గొంటారని ఆమె తెలిపారు.

నేడు కురుబ, మాల, వక్కలిగుల ఆత్మీయ సమావేశం

మడకశిర టౌన్, మే 7: టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం మాల, వక్కలిగ, వడ్డెర, కురబ, శెట్టిబలిజ ఆత్మీయ సమావేశం ఏ ర్పాటు చేసినట్లు టీడీపీ నియోజకవర్గం సమన్వయకర్త గుం డుమల తిప్పేస్వామి తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజుతో కలసి సమావేశంలో పాల్గొంటమన్నారు. ఉదయం 9గంటలకు టీడీపీ కార్యాలయం అవరణంలో మాల సామాజికవర్గంతో, 11కు వడ్డెర కులస్థులతో, మధ్యహ్నం ఒంటి గంటకు కురుబ కులస్థులతో, రెండు గంటలకు శెట్టిబలిజ కులస్థులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో కుంచిటిగ వక్కలిగ కులస్థులతో ఆత్మీయ సమావేశం ఉంటుందన్నారు. అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి హరేసముద్రం పంచాయతీ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నం

సీఐటీయూ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట ధర్నా



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆశాకార్యకర్త షబ్బీరీ

గోరంట్ల, మే 7: పట్టణంలోని రెండోవార్డుకు చెం దిన ఆశా కార్యకర్త షబ్బరీ మంగళ వారం ఆత్మహ త్యా య త్నానికి పాల్ప డింది. ఉన్నతాధి కారుల వేధింపుల తో ఆమె విషద్రావ కం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యక ర్తలు ఆసుప్రతి వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. శివాల యం వీధిలోని ఆరోగ్య ఉపకేంద్రం వద్ద 104 వాహనంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య పరీక్షలను మంగళవారం నిర్వహించారు. ఆ సమ యంలో బీపీ మిషన్, స్టెత్‌స్కోప్ కనిపించ లేదని ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి దొంగతనం నేరం మోపుతూ ఆశాకా ర్యకర్త షబ్బరీని అందరి ముందు మందలించినట్లు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన షబ్బరీ జెండాలబండ వీధిలోని తన ఇంటికెళ్లి విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అస్వస్థతకు గురైన ఆమె ను గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించగా డాక్టర్ వినోద్‌కుమార్ వైద్య చికిత్సలందించారు. ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి కొంతకాలంగా ఏదో ఒక నేపంతో తనను వేధిస్తోందని, కొందరు ఆశాకార్యకర్తలు మద్దతు పలుకుతుండడంతో ఈఘాతుకా నికి పాల్పడినట్లు బాధితరాలు షబ్బరీ ఆసుపత్రిలో తెలిపారు. ఆ మెను మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

ఆశాకార్యకర్తల ధర్నా: ఆశాకార్యకర్త షబ్బరీ ఆత్మహత్యాయత్నం గురించి తెలుసుకుని సీఐటీయూ నాయకుడు సాంబశివ ఆధ్వర్యం లో ఆశాకార్యకర్తలు గోరంట్ల పీహెచ్‌సీ ఎదుట సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఇందుకు బాధ్యురాలైన గౌతమిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి ఎదుటున్న హిందూపురం - కదిరి ప్రధాన రహదారిపై బైఠాయించి, రాకపోకలను స్తంభింపచే శారు. డాక్టర్ శ్రుతి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అక్కడికి చేరుకుని వారి చర్చించారు. సీఐ సుబ్బరాయుడు సర్దిచెప్పారు. ఆశాకార్య కర్తలు ఇచ్చిన పిర్యాదును డాక్టర్‌కు అదించంగా, చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు డాక్టర్ తెలిపా రు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే పోలీస్ కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. దీంతో వారు ఆందోళన విరమించారు.



ఆసుపత్రి ఎదుట రోడ్డుపై ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

పార్థసారథి సంయమనం



వైసీపీ రథానికి దారివ్వాలని ఆదేశిస్తున్న బీకే పార్థసారథి

గోరంట్ల, మే 7: టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో వైసీపీ ప్రచారం రథం ఎదురుపడింది. దీంతో టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డాయి. అయితే బీకే సంస్కారాన్ని ప్రదర్శిస్తూ పరిస్థితిని చక్కదిద్దారు. గోరంట్ల మండలంలోని మల్లాపల్లిలో సోమవారం సాయంత్రం బీకే ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహిస్తున్నారు. పెనుకొండ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి ఉషశ్రీ చరణ్‌కు సం బంధించిన ఖాళీ ప్ర చార రథం గోరంట్ల వైపు వెళ్తూ ఎదురుప డింది. దాన్ని చూపిన టీడీపీ శ్రేణులు కేకలు, ఈలలు వేస్తూ, దా రివ్వలేదు. వెంటనే బీ కే స్పందిస్తూ మైక్ ద్వారా పార్టీ శ్రేణులను మదలించారు. ఇది మంచి పద్ధతి కాదన్నా రు. ఎదుటివారు తప్పు చేస్తే మనం ప్రశ్నించే లా ఉండాలి కానీ మ నం ఎలాంటి పొరపా టు చేయకూడదని చెప్పి ఆ వాహనానికి దారి ఇప్పించారు.